RNI No.TELTEL/2016/68720

పోలీస్ నిఘా POLICE NIGAH తెలుగు దిన & మాస పత్రిక
పోలీస్ నిఘా POLICE NIGAH Web NEWS TV
రెండు తెలుగు రాష్ట్రాల్లో రిపోర్టర్స్ కావలెను
Contact : 9133613813

ప్రజలకోసం పోలీస్

# పోలీస్ నిఘా
POLICE NIGAH
తెలుగు దినపత్రిక

Published from Rangareddy, (Circulated) by Hyderabad, Rangareddy, Nalgonda, Mahabubnagar, Sangareddy, Vikarabad, Medak, Siddipet, Karimnagar, Sirisilla(Vemulawada), Nizamabad, Warangal, Yadadri Bhonagiri, Nirmal, Adilabad

రిపోర్టర్లు కావలెను
పోలీస్ నిఘా POLICE NIGAH NEWS TV
TG-AP
తెలంగాణ - ఆంధ్రప్రదేశ్
- మండలాల వారీగా కావలెను
- ఎలాంటి టార్గెట్స్ ఉండవు
- సీనియర్లకు ప్రాధాన్యం
- కొత్తవారికి అవకాశం
- లోగో, ఐ.డి. కార్డు, ట్యాగ్
- వెహికల్ స్టిక్కర్ ఇవ్వబడును.
9133613813, 9642614994
@PoliceNigahNewsTv

రంగారెడ్డి | సంపుటి : 10 సంచిక : 174 | ఎడిటర్: కేమోజు శ్రీనివాస్ | శనివారం 28-03-2026 | వెల: రూ.5/- | పేజీలు: 8

## సీఎంలతో సమావేశమైన మోదీ

### ఇంధన సంక్షోభం, రాష్ట్రాల సన్నద్ధతపై సమీక్ష



న్యూఢిల్లీ, మార్చి 27 : పశ్చిమాసియాలో ఘర్షణలు, హోర్ముజ్ జలసంధి మూసివేత భయాల కారణంగా అంతర్జాతీయ సంక్షోభం తలెత్తడంతో రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇంధన సంక్షోభంపై చర్చించారు. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ, ఎరువుల సరఫరాకు ఎదురవుతున్న సమస్యలు, రాష్ట్రాల సన్నద్ధతను సమీక్షించారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రకటించిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు మినహా తక్కిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. దేశ ఇంధన అవసరాలను తీర్చేందుకు, ఇంధన సరఫరా స్థిరంగా ఉండేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది. అయితే క్షేత్రస్థాయిలో అమలు కోసం రాష్ట్రాల సహకారాన్ని ఇప్పటికే కోరింది. పశ్చిమాసియాలో పరిస్థితుల ప్రభావం అంతర్జాతీయంగా అన్ని దేశాలపై పడిందని, భారత్‌పైనా ప్రభావం ఉందని ప్రధాని మోదీ పార్లమెంటు ఉభయసభల్లోనూ ప్రకటించారు. కోవిడ్ మహమ్మారిని సమష్టిగా ఎదుర్కొన్నట్టే తాజా పరిస్థితులను కేంద్రం, రాష్ట్రాలు కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. నిత్యావసర వస్తువుల సరఫరాకు ఎలాంటి అవాంతరం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్రాలను కోరారు. టీమిండియా స్పిరిట్‌తో పనిచేసి దేశానికి మారదర్శకంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రులతో మోదీ తాజాగా వర్చువల్ సమావేశంలో పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధానమంత్రి నిర్వహించిన వర్చువల్ మీట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ సాయి, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, జేకే సీఎం ఒమర్ అబ్దుల్లా, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ తదితరులు పాల్గొన్నారు.

# కన్నులపండువగా సీతారాముల కళ్యాణం

### పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ దంపతులు

### రామనామ స్మరణతో మార్మోగిన భద్రాచలం వీధులు





దక్షిణ అయోధ్యలో వైభవోపేతంగా శ్రీరామనవమి వేడుకలు

భద్రాచలం,, మార్చి 27 (పోలీస్ నిఘా) : చైత్ర శుద్ధ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రాచలం పుణ్యక్షేత్రం భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. "దక్షిణ అయోధ్య"గా పిలువబడే భద్రాద్రిలో సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. పునర్వసు నక్షత్రం, అభిజిత్ లగ్నాన సాక్షాత్తు ఆ పరమాత్ముడు జన్మించిన శుభవేళ.. భక్త రామదాసు నిర్మించిన ఈ దివ్యాలయంలో జానకీ రాముల కళ్యాణాన్ని వీక్షించేందుకు దేశ నలుమూలల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు.

**ప్రభుత్వ లాంఛనాలతో వైభవం**

రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. తొలుత గర్భాలయంలోని ధ్రువమూర్తులను దర్శించుకున్న అనంతరం, మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన కళ్యాణ వేదిక వద్దకు చేరుకున్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు,కొండా సురేఖ తదితరులు ఈ వేడుకలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

**అభిజిత్ ముహూర్తాన అద్భుత ఘట్టం**

పాంచారాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం భద్రాద్రిలో అవతార దినోత్సవం నాడే కళ్యాణం నిర్వహించడం ఆనవాయితీ. మధ్యాహ్నం 12 గంటల సమయంలో అభిజిత్ ముహూర్తాన వేద మంత్రోచ్చారణల మధ్య కళ్యాణ ఘట్టాలు జరిగాయి. సీతమ్మకు మూడు తాళిబొట్లు కట్టడం ఇక్కడి ప్రత్యేకత. దశరథ మహారాజు, జనక మహారాజు మరియు భక్త రామదాసు తరపున ఈ మూడు సూత్రాలను ధరింపజేయడం భద్రాచల క్షేత్ర విశిష్టతను చాటిచెప్పింది.

**ఎరుపు రంగు తలంబ్రాల వెనుక చారిత్రక నేపథ్యం**

సాధారణంగా కళ్యాణంలో పసుపు రంగు తలంబ్రాలు కనిపిస్తాయి, కానీ భద్రాద్రిలో మాత్రం అవి ఎరుపు రంగులో మెరుస్తాయి. దీని వెనుక రామదాసు కాలం నాటి చరిత్ర ఉంది. రామదాసును బంధించిన తప్పు తెలుసుకున్న తానీషా ప్రభువు, పశ్చాత్తాపంతో స్వామివారికి పంపిన 'బుక్కా గులాల్' (సుగంధ ద్రవ్యం) కలపడం వల్లే తలంబ్రాలు ఎర్రగా మారతాయని పురాణాలు చెబుతున్నాయి. నేటికీ అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ గులాల్ కలిపిన ముత్యాల తలంబ్రాలనే ఉపయోగిస్తున్నారు.

**పాల్గొన్న ప్రముఖులు**

ఈ వేడుకలో ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ప్రభుత్వ ఉన్నతాధికారులు శైలజా అయ్యర్, హన్మంత రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ తదితర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో దామోదర్ రావు నేతృత్వంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. కళ్యాణాన్ని దర్శించుకోవడం వల్ల అశ్వమేధ యాగ ఫలం లభిస్తుందని నమ్మే భక్తులు జై శ్రీరామ్ నినాదాలతో భద్రాద్రిని మారుమ్రోగించారు.

## పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు

### కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ



న్యూఢిల్లీ, మార్చి 27 : అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్న వేళ సామాన్య భారతీయుడిపై ఆ భారం పడకుండా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయాన్ని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ కొనియాడారు. ఈ మేరకు ఆయన 'X' (ట్విట్టర్) వేదికగా ట్వీట్ చేశారు. అదేవిధంగా ప్రపంచ దేశాల పరిస్థితిని, భారత్ అనుసరిస్తున్న వ్యూహాన్ని వివరించారు.

**ప్రజలను కష్టాల నుంచి గట్టెక్కించాలనే..**

నెల రోజుల వ్యవధిలో అంతర్జాతీయ ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 122 డాలర్లకు పెరిగాయి తెలిపారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు మండిపోతున్నాయని అన్నారు. ఆగ్నేయాసియాలో 30 శాతం నుంచి 50శాతం, ఉత్తర అమెరికాలో 30 శాతం, ఐరోపాలో శాతం, ఆఫ్రికా దేశాల్లో 50 శాతం వరకు ధరలు పెరిగాయని తెలిపారు. కానీ, తన ప్రభుత్వ ఆర్థిక వనరులపై భారం పడినప్పటికీ ప్రధాని మోడీ భారత పౌరులను అంతర్జాతీయ ఒడిదుడుకుల నుంచి రక్షించాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. గత నాలుగేళ్లుగా రష్యా–ఉక్రెయిన్ యుద్ధం వల్ల ఏర్పడిన అస్థిరత సమయంలో కూడా పౌరుల ప్రయోజనాలకే మా ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని అన్నారు.

# ఏప్రిల్ 25న కవిత కొత్త పార్టీ



నిజామాబాద్, మార్చి 27 (పోలీస్ నిఘా) : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు నూతన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తామన్నారు. శ్రీరామనవమి మంచి రోజు కాబట్టి ఇవాళ ప్రకటన చేస్తున్నట్లు చెప్పారు. యువత, మహిళలకు తమ పార్టీలో మంచి స్థానం ఉంటుందని, ఇన్నాళ్లూ మగవాళ్లు ఏర్పాటు చేసిన పార్టీలను చూశారు.. ఇపుడు తెలంగాణ ఆడబిడ్డగా తాను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారుగా అని అన్నారు. దీంతో నూతన పార్టీపై కొంతకాలంగా వస్తున్న ఊహాగానాలకు కవిత తెరదించారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలి రావాలని కవిత పిలుపునిచ్చారు. జయశంకర్ పేరు పెట్టుకుంటామని చెప్పారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఒక ఆడబిడ్డగా ఈ పార్టీని పెడుతున్నానని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమవుతుందన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాలను శ్రీరాముడి స్ఫూర్తితో గమనించాలన్నారు. నేను నిజామాబాద్ బిడ్డను.. నిజామాబాద్ మట్టి మంచిది.. ఇక్కడ తీసుకునే ఏ నిర్ణయమైనా సక్సెస్ అయింది అని చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించలేకపోయామన్నారు. రోజూ ప్రజల అవస్థలు చూస్తున్నామని కవిత వ్యాఖ్యానించారు. కచ్చితంగా ఒక కొత్త పార్టీ రావాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ మెచ్చేలా ఆ పార్టీ ఉండాలని అభిప్రాయపడ్డారు. సర్వోదయ తెలంగాణ రావాలని కవిత పేర్కొన్నారు. తాము ఎవ్వరికీ 'బి' పార్టీ కాము. తమది నంబర్ వన్ పార్టీ అవుతుంది. శ్రీరాముడి స్ఫూర్తితో, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని పనిచేస్తామన్నారు. ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. 95 శాతం తెలంగాణ ప్రాంతీయ పార్టీగా, ఇంటి పార్టీగా రాబోతోందని పేర్కొన్నారు.

### రామనవమి వేళ అద్భుత దృశ్యం..

# అయోధ్యరాముడికి 'సూర్యతిలకం'



అయోధ్య, మార్చి 27 : ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు అంబరాన్నంటాయి. శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన తర్వాత వచ్చిన మూడో శ్రీరామ నవమి ఇది. ఈ సందర్భంగా ఆలయంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. బాలరాముడి నుదిటిపై 'సూర్య తిలకం' చూసి భక్తులు పరవశించారు. ఈ పండగ వేళ... స్వామి దర్శనం కోసం దేశవిదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. అయోధ్య ఆలయంలో గర్భగుడిలోని బాలరాముడి విగ్రహం నుదుటిపై సూర్యకిరణాలు పడేందుకు మూడో అంతస్తులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరిమిత సంఖ్యలో పైపులు, కుంభాకార, పుటాకార కటకాలతో ఒక వ్యవస్థను రూపొందించారు. ఆలయ శిఖర భాగంలో సూర్యకాంతి గ్రహించేందుకు ఒక పరికరాన్ని ఏర్పాటుచేశారు. అక్కడినుంచి పైపు లోపలికి కాంతి ప్రసరించి తిలకం వలే కన్పిస్తోంది. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్(ఐఐఏ) శాస్త్రవేత్తలు, పరిశోధకుల సాయంతో కేంద్ర భవన నిర్మాణ పరిశోధన సంస్థ(సీబీఆర్ఐ) శాస్త్రవేత్తలు దీనిని నిర్మించారు.

**ప్రతి శ్రీరామనవమి రోజున..**

ప్రతి శ్రీరామ నవమి రోజున బాలరాముడి నుదుటిపై ఈ తిలకం దిద్దేలా ఏర్పాట్లు చేశారు. అందుకోసం గడియారంలో ముల్లులు తిరిగేందుకు ఉపయోగించే పరిజ్ఞానం తరహాలో గేర్ టీత్ మెకానిజం వినియోగించారు. సూర్యకాంతిని గ్రహించే పరికరం వద్దే మరో పరికరం ఉంచారు. ఇది కాంతిని గ్రహించే అద్దాన్ని 365 రోజులు స్వల్పంగా కదుపుతూ ఉంటుంది. మళ్లీ శ్రీరామనవమి రోజు వారు అనుకున్న చోటుకు తీసుకొస్తుంది. అంతకుముందే ఏటా శ్రీరామనవమి వచ్చే కాలాన్ని అత్యంత కచ్చితత్వంతో గణించారు.

# పెళ్లయిన వ్యక్తి సహజీవనం చేయడం నేరం కాదు

### అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు



అలహాబాద్, మార్చి 27 : పెళ్లి అయిన వ్యక్తి మేజర్ అయిన మహిళతో సహజీవనం చేస్తోన్న కేసులో అలహాబాద్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. వారిద్దరు పరస్పర సమ్మతితో ఆ బంధంలో ఉన్నారని.. దాంతో ఆ వివాహితుడిపై ఎలాంటి అభియోగాలు మోపలేమని పేర్కొంది. ఆ రిలేషన్‌ను వ్యతిరేకిస్తూ యువతి తల్లి పోలీసు కేసు పెట్టగా.. దానిని కొట్టివేయాలంటూ ఆ జంట కోర్టును ఆశ్రయించింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. తన కుమార్తెను ప్రలోభపెట్టి తీసుకెళ్లిపోయాడంటూ సదరు వివాహితుడిపై ఉత్తర్‌ప్రదేశ్‌లోని జైతీపూర్ పోలీస్ స్టేషన్‌లో సహజీవనం చేస్తోన్న యువతి తల్లి ఫిర్యాదు చేసింది. ఆ కేసు కొట్టేయాలంటూ ఆ జంట వేసిన రిట్ పిటిషన్ విచారణలో భాగంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "నైతికత, చట్టానికి మధ్య సన్నని గీత ఉంది. చట్ట ప్రకారం చూసుకుంటే.. ప్రాథమికంగా ఆ వ్యక్తి నేరం చేసినట్లు కనిపించడం లేదు. పౌరుల హక్కులను పరిరక్షించేందుకు కోర్టులు తీసుకునే చర్యలను.. సమాజంలో ఉన్న అభిప్రాయాలు, నైతికత నిర్ణయించలేవు" అని పేర్కొంది. అలాగే ఆ సహజీవన భాగస్వాములను అరెస్టు చేయొద్దని తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. అతడు పెళ్లయిన వ్యక్తి కాబట్టి మరో మహిళతో సహజీవనం చేయడం నేరపూరిత చర్య అని యువతి కుటుంబం తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. వారిద్దరు పరస్పర అంగీకారంతోనే ఆ బంధంలో ఉంటే.. అతడిపై అభియోగాలు మోపలేమని కోర్టు స్పష్టం చేసింది. అలాగే తాను మేజర్‌నని, పూర్తి ఇష్టంతోనే ఈ సహజీవనంలో కొనసాగుతున్నానని పోలీసుల వద్ద ఆ యువతి పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించింది. పరువు హత్య జరగొచ్చంటూ ఆ పిటిషనర్లు ఆందోళన వ్యక్తంచేయగా.. వారికి రక్షణ కల్పించాలని పోలీసులకు కోర్టు ఆదేశాలు ఇచ్చింది. అంతేగాకుండా మహిళ తరఫు బంధువులు సంయమనం పాటించాలని, ఆ జంటకు ఎలాంటి హాని కలిగించకూడదని సూచించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 8కి వాయిదా వేసింది.

**దేశంలోని 50% విమానాల్లో సాంకేతిక లోపాలు** ▸▸8లో

### సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయి..

# కంగారుపడొద్దు: జేపీ నడ్డా



న్యూఢిల్లీ, మార్చి 27 : పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ మార్కెట్‌లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది. దీనిపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా లోక్‌సభలో స్పందించారు. ఎరువులపై యుద్ధ ప్రభావం పడకుండా రైతుల అవసరాలకు తగ్గట్టు సరఫరా చేస్తాం అని మంత్రి హామీ ఇచ్చారు. "ముడిసరకుల దిగుమతి విషయంలో ఒక్క దేశం పైనే ఆధారపడకుండా పలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాం. ఈ విషయంలో ఇప్పటికే అనేక దేశాలతో భారత్ సుదీర్ఘకాలానికి ఒప్పందాలు చేసుకుంది. ఔషధాల తయారీ కోసం ఇతర దేశాల నుంచి ముడిసరకు దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం" అంటూ జేపీ నడ్డా లోక్‌సభలో వివరించారు.

# భోజనంలో బల్లి

## విద్యార్థుల ఆరోగ్యం పై శ్రద్ధ లేని హాస్టళ్లు

### పుట్టగొడుగుల్లా హాస్టళ్లు...పట్టింపులేని విద్యా శాఖ




వరంగల్, మార్చి 27 (పోలీస్ నిఘా) : హనుమకొండ భీమారం ప్రాంతంలోని ఎస్‌వీఎస్ కళాశాల సమీపంలో ఉన్న శశాంక బాయ్స్ హాస్టల్‌లో భోజనంలో బల్లి కనిపించడం కలకలం రేపింది. గురువారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో హాస్టల్‌లో ఉన్న విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

**సంఘటనపై ఫిర్యాదు**

భోజనంలో బల్లి కనిపించిందని విద్యార్థులు నిర్వాహకులకు తెలియజేయగా, వారిని సముదాయించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. అయితే విద్యార్థులు దీనిపై అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఫుడ్ ఇన్స్పెక్టర్ అక్కడికి చేరుకుని భోజనాన్ని పరిశీలించారు. అనంతరం హాస్టల్ నిర్వాహకులకు 15వేల జరిమానా విధించినట్లు తెలుస్తోంది.

**అపరిశుభ్ర పరిసరాలు**

హాస్టల్ వద్ద సరైన బోర్డు లేకపోవడం, కనీస పరిశుభ్రత పాటించకపోవడం వంటి అంశాలపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఈ హాస్టల్ గంజాయి విషయంలో వివాదాస్పదంగా మారిన సందర్భాలు ఉన్నట్లు సమాచారం.

**గతంలో ఆరోపణలు**

ఆహార భద్రతా శాఖ అధికారులు కేవలం 15వేల జరిమానాతో సరిపెట్టారని, కఠిన చర్యలు తీసుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**చర్యలేవి?**

సంబంధిత అధికారులు స్పందించి హాస్టల్‌పై తగిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

# చిట్కుల్ 7వ వార్డులో అంగరంగ వైభవంగా శ్రీరామనవమి వేడుకలు



పటాన్ చెరు, మార్చి 27 (పోలీస్ నిఘా) : సంగారెడ్డి జిల్లా, పటాన్ చెరు నియోజకవర్గం, ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్ గ్రామ పరిధిలోని 7వ వార్డులోని 18 కాలనీలకు చెందిన ప్రజలు ఏకతాటిపైకి వచ్చి శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో శ్రీరాముని సేవలో నిమగ్నమయ్యారు. వేడుకలలో భాగంగా శ్రీ సీతారాముల కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ కళ్యాణ మహోత్సవం భక్తులను ఆకట్టుకుంది. కళ్యాణం సందర్భంగా భక్తులు హారతులు సమర్పించి, స్వామివారికి తమ కోరికలు తెలియజేసుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ మోటే సుమలత , 7వ వార్డు తలారి ఆంజనేయులు, 6వ వార్డు బ్యాగరి వెంకటేష్,పాశ మైలారం మాజీ సర్పంచ్ మోటే కృష్ణ యాదవ్ ,మాజీ వార్డ్ సభ్యులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. వారు మాట్లాడుతూ, శ్రీరామనవమి వంటి పర్వదినాలను కలిసికట్టుగా నిర్వహించడం ద్వారా కాలనీల మధ్య ఐక్యత, సామరస్య వాతావరణం మరింత బలపడుతుందని తెలిపారు. అదేవిధంగా, టెంపుల్ ట్రస్ట్ కమిటీ ఆధ్వర్యంలో వచ్చే రెండు సంవత్సరాలలోపు శ్రీరాములవారి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంకల్పించినట్లు కాలనీ వాసులు వెల్లడించారు. ఆలయ నిర్మాణానికి అందరి సహకారం అవసరమని, దీనికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా కొనసాగింది.

# రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్




వరంగల్, మార్చి 27 (పోలీస్ నిఘా) : వరంగల్ నగరంలోని జక్కలొద్దిలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ (టీఎంఆర్ఈఐఎస్) పాఠశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాల కార్యక్రమంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, నిబంధనలు పాటించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని సూచించారు. ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సుమా, జిల్లా బిసి, ఎస్సి, ఎస్టీ సంక్షేమ అధికారులు, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# బైక్ స్టంట్లతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తి అరెస్ట్



హైదరాబాద్, మార్చి 27 (పోలీస్ నిఘా) : లుంబిని పార్కు మరియు తెలంగాణ రాష్ట్ర సెక్రటేరియట్ సమీపంలోని బహిరంగ రహదారులపై అత్యంత ప్రమాదకరమైన రీతిలో బైక్ స్టంట్లు చేస్తూ, సోషల్ మీడియా రీల్స్ కోసం వాహనదారులను మరియు పాదచారులను భయాందోళనకు గురిచేస్తున్న ఒక వ్యక్తిని సైఫాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.

నిందితుడి వివరాలు: పేరు: ఇబ్రహీం బేగ్ (23), తండ్రి: ఖాసిం బేగ్. నివాసం: శంకర్ నగర్, ఓల్డ్ మలక్‌పేట్. వృత్తి: విద్యార్థి.

కేసు నేపథ్యం: నిందితుడు సోషల్ మీడియాలో ప్రాచుర్యం పొందేందుకు తన మోటారు సైకిల్‌పై బాధ్యతారహితంగా స్టంట్లు చేస్తూ వీడియోలు చిత్రీకరిస్తున్నాడు. సెక్రటేరియట్ వంటి అత్యంత భద్రత కలిగిన ప్రాంతాల్లో సాధారణ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలిగించడమే కాకుండా, ప్రాణహాని కలిగించే విధంగా ఇతని చర్యలు ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మరియు నిరంతర నిఘా ద్వారా సైఫాబాద్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విన్యాసాలకు ఉపయోగించిన బైక్‌ను మరియు వీడియోలు చిత్రీకరించిన మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ శ్రీ ఏరుకొండ సీతయ్య గారి పర్యవేక్షణలో, దర్యాప్తు అధికారి శ్రీమతి వి. పరమేశ్వరి, పోలీసు సిబ్బంది ఎల్. సంపత్ మరియు ఎస్. మహేష్ ఈ అరెస్టులో పాల్గొన్నారు.

హెచ్చరిక: ప్రజా భద్రతకు విఘాతం కలిగిస్తూ, రోడ్లపై ప్రమాదకర విన్యాసాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసులు హెచ్చరించారు.

# మల్కపేటలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం

**రామనామ స్మరణతో మార్మోగిన మల్కపేట.. వేలాదిగా తరలివచ్చిన భక్తజనం**




కోనరావుపేట , మార్చి 27 (పోలీస్ నిఘా) : కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలోని శ్రీ సీతారామ హనుమ సమేత రామాలయం శుక్రవారం రామనామ స్మరణతో మారుమోగింది. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కోదండ రాముని కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగింది. ఈ వేడుకకు ఆలయ వ్యవస్థాపకులు మాజీ మంత్రి చల్మెడ ఆనందరావు తన కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు మరియు వారి సతీమణి సునీల దంపతుల సమక్షంలో కళ్యాణ క్రతువు శాస్త్రోక్తంగా సాగింది. పునర్వసు నక్షత్ర యుక్త శుభ ముహూర్తాన అర్చకుల వేద మంత్రోచ్చారణలు మరియు మంగళ వాయిద్యాల నడుమ సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించారు. అభిజిత్ లగ్నంలో జరిగిన ఈ అపురూప ఘట్టాన్ని తిలకించిన భక్తులు జై శ్రీరామ్ జైజై శ్రీరామ్ అంటూ నినదించడంతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మల్కపేట రాములోరి కళ్యాణాన్ని వీక్షించేందుకు కేవలం చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా రాజన్న సిరిసిల్ల జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ వ్యవస్థాపకులు మరియు మల్కపేట గ్రామ ఆలయ కమిటీ సభ్యులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నీడ మరియు తాగునీటి సదుపాయాలు కల్పించారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. లోక కళ్యాణం కోసం జరిగిన ఈ వేడుకలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులవ్వడం తమ అదృష్టమని భక్తులు హర్షం వ్యక్తం చేశారు. చల్మెడ ఆనందరావు కుటుంబ సభ్యులు ఆలయ కమిటీ ప్రతినిధులు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకను విజయవంతం చేశారు.

# కుళ్ళిన చికెన్ సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

**సుమారు 352 కిలోల మాంసం స్వాధీనం**



హైదరాబాద్, మార్చి 27 (పోలీస్ నిఘా) : ప్రజారోగ్యానికి హాని కలిగించే విధంగా నిల్వ ఉంచిన కుళ్ళిన చికెన్‌ను స్థానిక విక్రేతలకు సరఫరా చేస్తున్న ఒక వ్యక్తిని హైదరాబాద్ కమిషనర్ టాస్క్ ఫోర్స్ బృందం అరెస్ట్ చేసింది. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను హైదరాబాద్ సిటీ కమిషనర్ టాస్క్ ఫోర్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఐపిఎస్ గారు వెల్లడించారు.

ఘటన వివరాలు: విశ్వసనీయ సమాచారం మేరకు, హెచ్-ఫాస్ట్ బృందం వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ కె. నాగార్జునతో కలిసి మూసాపేట సమీపంలోని భరత్ నగర్, జింకలవాడ వద్ద ఉన్న 'మెసర్స్ ఎస్.పి.ఆర్ చికెన్' ప్రాంగణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ ఉంచిన కుళ్ళిన చికెన్‌ను గుర్తించారు. దీనిని స్థానిక హోటళ్లు మరియు విక్రేతలకు సరఫరా చేస్తున్నట్లు నిర్ధారణ అయింది.

అరెస్టయిన వ్యక్తి వివరాలు: పేరు: సూరజ్ పాల్ (66),వృత్తి: వ్యాపారం, నివాసం: రాజీవ్ గాంధీ నగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్.

స్వాధీనం చేసుకున్న వస్తువులు: సుమారు 352 కిలోల గడ్డకట్టిన కుళ్ళిన చికెన్ (రెక్కలు, రొమ్ము భాగం మరియు కాలేయం వంటి భాగాలు) స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల పరిశీలనలో వెల్లడైన అంశాలు: చికెన్ నిల్వ ఉంచిన ప్రాంగణం అత్యంత అపరిశుభ్రంగా ఉంది. సదరు సంస్థకు సంబంధించిన ఈఘాంఎ లైసెన్స్ గడువు ముగిసింది. నిల్వ చేసిన మాంసం మానవ వినియోగానికి ఏమాత్రం యోగ్యమైనది కాదు.

హెచ్-ఫాస్ట్ బృందం స్వాధీనం చేసుకున్న మాంసాన్ని మరియు నిందితుడిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం సనత్ నగర్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓకు అప్పగించింది. ఈ ఆపరేషన్‌లో హెచ్-ఫాస్ట్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది మరియు సనత్ నగర్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రజలకు సూచనలు: ఆహార పదార్థాలను కేవలం అధీకృత మరియు పరిశుభ్రమైన కేంద్రాల నుంచే కొనుగోలు చేయండి. సరైన గుర్తింపు లేని విక్రేతల వద్ద ఆహారాన్ని తీసుకోవద్దు. ఎక్కడైనా అపరిశుభ్రమైన లేదా అనుమానాస్పద ఆహార తయారీ పద్ధతులు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించండి. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో ప్రజల సహకారం ఎంతో అవసరం.

# దేవాదుల పంపు హౌస్ ను పరిశీలించిన జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి కాంతారావు



హనుమకొండ , మార్చి 27 (పోలీస్ నిఘా) : హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం దేవన్నపేట శివారులోని దేవాదుల పంప్ హౌస్ తోపాటు ధర్మసాగర్ లోని రిజర్వాయర్, సౌత్ మెయిన్ కెనాల్ ను కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి వి ఎల్ కాంతారావు శుక్రవారం సందర్శించారు. దేవన్నపేట పంప్ హౌస్, ధర్మసాగర్ సౌత్ మెయిన్ కెనాల్ వివరాలను అధికారులు కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి కి వివరించారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి వి ఎల్ కాంతారావు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్ అండ్ అర్ కమిషనర్ శివకుమార్ నాయుడు, కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ సీనియర్ జాయింట్ కమిషనర్ కుల్దీప్ సింగ్, సిడబ్ల్యుసి డైరెక్టర్ శ్రీనివాస్, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఇఎన్సీ జనరల్ రమేష్ బాబు, చీఫ్ ఇంజనీర్ సుధీర్, ఇరిగేషన్ ఎస్ ఈ రాం ప్రసాద్, ఈఈలు సీతారాం,మంగీలాల్, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, జిల్లా సాగునీటిపారుదల శాఖ అధికారి రామ్మోహన్, మెగా ప్రాజెక్టు మేనేజర్ తిరుపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వేల్పుగొండ గ్రామంలో శ్రీ రామా చలం గుట్టపై సీతారాముల కళ్యాణం




టేక్మాల్, మార్చి 27 (పోలీస్ నిఘా) : మెదక్ జిల్లా ఆందోల్‌నియోజకవర్గం టేక్మాల్ మండలం వేల్పుగొండ గ్రామంలో శ్రీ రామా చలం గుట్టపై సీతారాముల కళ్యాణం శ్రీ శ్రీ శ్రీ పూ"పా" రాజయోగి వెంకట స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం చైత్ర శుద్ధ నవమి రోజున ఉదయం వేద బ్రాహ్మణ పండితులచే గణపతి పూజ, గోపూజ, గురుపూజ, అగ్ని ప్రతిష్ట, శ్రీరామ మూలమంత్ర వాహనము ప్రారంభించడం జరిగింది. భజన సంకీర్తన, అఖండ శ్రీరామ రామ జపం నిర్వహించరు. గ్రామంలోని పుర వీధుల్లో నుండి రామచలం గుట్టపైకి బోనాలు, గండ జ్యోతులు, ఊరేగింపు నిర్వహించడం జరిగింది.అనంతరం సీతారాముల విగ్రహాలను కళ్యాణ వేదికపై స్వాగతించి అంగరంగ వైభవంగా వేద బ్రాహ్మణ పండితులచే సీతారాముల కళ్యాణం నిర్వహించడం జరిగింది.ఇట్టి కళ్యాణానికి వేల సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి కళ్యాణోత్సవం లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి ఆశీర్వాదం తీసుకొని తీర్థప్రసాదాలు తీసుకున్నారు.అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కల్యాణోత్సవంలో పలు సాంస్కృతిక నృత్యాలు భక్తులను కనువిందు చేశాయి. సాయంత్రం సీతారాముల పల్లకి సేవను భజన సంకీర్తనలతో గ్రామంలో పురవీధుల గుండ ఊరేగింపుగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ భాను ప్రకాష్ ఆలయ కమిటీ భక్త బృందం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చేవెళ్ల కోర్ట్ బార్ ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి



చేవెళ్ల, మార్చి 27 (పోలీస్ నిఘా) : చేవెళ్ల కోర్టు బార్ ఎన్నికలలో పాటి మధుసూదన్ రెడ్డి ప్రత్యర్థి సురేందర్ గౌడ్ పై 55 ఓట్ల మెజారిటీ తో ఘన విజయం సాధించారు. మొత్తం పోలైన ఓట్లు 151 కాగా అందులో 103 మధుసూదన్ రెడ్డికి రాగ ప్రత్యర్థి సురేందర్ గౌడ్ కి 48 ఓట్లు వచ్చాయి. మధుసూదన్ రెడ్డి 55 ఓట్ల భారీ మెజార్టీ వచ్చింది. వైస్ ఛైర్మెన్ గా ఎన్.చంద్రశేఖర్ ముదిరాజ్జనరల్ , ఎస్.మాధురిమహిళా , జనరల్ సెక్రెటరీగా పి. మల్లేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా 1) బి ఆనంద్. 2)మహేష్. 3)సుదర్శన్. 4)ప్రవీణ్ రెడ్డి లు విజయం సాధించారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన వారి వివరాలు... జాయింట్ సెక్రెటరీ ఈ రవీందర్ రెడ్డి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ ఏ. ప్రభాకర్ రెడ్డి, ట్రెజరర్ ఈ జనార్ధన్, లైబ్రేరియన్ టీ మహేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ( మహిళ ) కే. ప్రవీణ మరియు మనీషా లు ఏకగ్రీవం ఎన్నిక అయ్యారు.

# ఇసుక ఆక్రమ రవాణా చేస్తున్న విద్యుత్ లైన్మెన్ తుప్పతి కృష్ణమూర్తి అరెస్ట్



అడ్డగూడూర్, మార్చి 27 (పోలీస్ నిఘా) : అడ్డగూడూర్ మండల పరిధిలోని బిక్కేరు వాగు నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నటువంటి అడ్డగూడూర్ గ్రామానికి చెందిన తూప్పతి కృష్ణమూర్తి ఎస్/ఓ మల్లయ్య, వయస్సు 48 సంవత్సరాలు, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ లో లైన్మెన్ గా పనిచేస్తూ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా అడ్డగూడూర్ ఎ.ఎ అదుపులోకి తీసుకోని అతనిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారుప్రస్తుతం నిందితుడు ఆత్మకూరు మండలం కప్రైపల్లి విలేజ్ లో లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు..ఇతను లైన్మెన్ విధులు నిర్వహించకుండా బికేరువాగు నుండి ఇసుక వ్యాపారం చేయుచున్నాడు.

# భక్తి పరవశంలో శ్రీరామనవమి వేడుకలు

**శ్రీరామాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ దంపతులు**



హనుమకొండ , మార్చి 27 (పోలీస్ నిఘా) : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమకొండలో భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఎన్పిడీసీఎల్ సిఎండీ శ్రీ వరుణ్ రెడ్డి గారితో కలిసి రెవెన్యూ కాలనీలోని శ్రీరామాలయాన్ని సందర్శించారు. ఆలయంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ నిర్వహించిన ఈ పూజల్లో పాల్గొన్న కలెక్టర్ దంపతులు, ప్రజల సంక్షేమం, శాంతి, సౌభ్రాతృత్వం కోసం దేవుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శ్రీరామనవమి పండుగ మనకు ధర్మం, న్యాయం, సత్యనిష్ఠ వంటి విలువలను గుర్తుచేస్తుందని అన్నారు. భగవాన్ శ్రీరాముని ఆదర్శాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని సూచించారు. సమాజంలో పరస్పర గౌరవం, ఐక్యత, సౌహార్దత పెంపొందించుకోవాలని కోరారు. పండుగ సందర్భంగా ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. స్వచ్ఛత, భద్రత, తాగునీటి వంటి సౌకర్యాలను సమకూర్చినట్లు వివరించారు. భక్తులు భక్తి భావంతో, క్రమశిక్షణతో పూజల్లో పాల్గొని పండుగను ఆధ్యాత్మికంగా జరుపుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.


పోలీస్ నిఘా

సంపాదకీయం | శనివారం | 28 మార్చి 2026

# నారీ శక్తికి పట్టాభిషేకం!

2029 ఎన్నికలు భారత పార్లమెంటును ఒక సరికొత్త 'నారీ శక్తి' వేదికగా మార్చబోతున్నాయి. తెరపై కనిపించే గణాంకాల కంటే, విధాన నిర్ణయాల్లో మహిళలు పోషించబోయే క్రియాశీలక పాత్ర దేశ భవిష్యత్తును నిర్దేశిస్తుంది. సామాజిక సమస్యల పట్ల మహిళలకు ఉండే సహజమైన సున్నితత్వం, జవాబుదారీతనం చట్టసభల పనితీరును మరింత మెరుగుపరుస్తాయని ఆశించవచ్చు. రాజకీయ సంకల్పం, పారదర్శకమైన అమలు మరియు రాష్ట్రాల మధ్య సమన్వయం తోడైతే, ఈ నూతన శకం భారత ప్రజాస్వామ్య కీర్తిని ప్రపంచ దేశాల ముందు సగర్వంగా నిలబెడుతుంది. భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో 2029వ సంవత్సరం ఒక అపూర్వమైన మలుపుగా నిలిచిపోనుంది. దశాబ్దాలుగా కేవలం ఎన్నికల ప్రణాళికలకే పరిమితమైన మహిళా రిజర్వేషన్ల అంశం, ఇప్పుడు ఆచరణాత్మక రూపం దాల్చి దేశ అత్యున్నత చట్టసభల ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేందుకు సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ వ్యూహాత్మక మార్పు కేవలం ఒక రాజకీయ సంస్కరణ మాత్రమే కాదు, అది దేశ సగం జనాభాకు దక్కాల్సిన సామాజిక న్యాయం మరియు గౌరవం. లోక్‌సభ స్థానాల సంఖ్యను గణనీయంగా పెంచుతూ, అందులో మూడింట ఒక వంతు మహిళలకు కేటాయించాలనే నిర్ణయం భారత రాజకీయాల్లో ఒక నూతన శకాన్ని ఆవిష్కరించనుంది. ఈ మార్పు ద్వారా ప్రస్తుతం ఉన్న పురుష ప్రతినిధుల స్థానాలకు ఎటువంటి భంగం కలగకుండానే, అదనంగా చేరే 273 స్థానాలను మహిళా శక్తికి అంకితం చేయడం ఒక దార్శనికతతో కూడిన అడుగు. దీనివల్ల రాజకీయాల్లో తలెత్తే అంతర్గత అసమ్మతిని తగ్గించడమే కాకుండా, శాసన వ్యవస్థలో మహిళల భాగస్వామ్యాన్ని శాశ్వతంగా సుస్థిరం చేయవచ్చు. అయితే, ఈ మహత్కార్యం సాకారం కావాలంటే జనాభా లెక్కల ఆధారంగా జరిగే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అత్యంత కీలకం. 2011 జనాభా గణాంకాల ప్రకారం సీట్ల కేటాయింపు జరగడం వల్ల ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి పెద్ద రాష్ట్రాల్లో ప్రాతినిధ్యం భారీగా పెరుగుతుంది. ఉదాహరణకు, ఉత్తరప్రదేశ్‌లో సీట్ల సంఖ్య 80 నుండి 120కి పెరగడం వల్ల ఆ రాష్ట్ర రాజకీయ ప్రాముఖ్యత జాతీయ స్థాయిలో మరింత బలపడుతుంది. అదే సమయంలో, అభివృద్ధి పథంలో దూసుకుపోతూ, జనాభా నియంత్రణలో అద్భుతమైన ఫలితాలు సాధించిన దక్షిణాది రాష్ట్రాల్లో ఒక రకమైన ఆందోళన నెలకొంది. క్రమశిక్షణతో జనాభాను తగ్గించుకున్నందుకు తమకు పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గిపోతుందేమోనన్న భయాలను పోగొట్టడం కేంద్ర ప్రభుత్వం ముందున్న ప్రధాన సవాలు. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని పోవడం, ప్రాంతీయ విభేదాలకు తావు లేకుండా జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఏకాభిప్రాయం సాధించడం అనివార్యం. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీయకుండా ఈ సీట్ల పెంపుదల ప్రక్రియ సాగాలి. మహిళా రిజర్వేషన్లతో పాటు సామాజిక సమతుల్యత కోసం షెడ్యూల్డ్ కులాలు మరియు తెగల (ఎస్సీ/ఎస్టీ) సీట్లను కూడా పెంచడం ఈ సంస్కరణలో ఒక గొప్ప భాగం. ఎస్సీ సీట్లు 84 నుండి 126కి, ఎస్టీ సీట్లు 47 నుండి 70కి పెరగడం వల్ల అట్టడుగు వర్గాలకు చట్టసభల్లో మరింత బలమైన గొంతుక లభిస్తుంది. ఇది రాజ్యాంగ నిర్మాతలు కలలుగన్న సమ్మిళిత ప్రజాస్వామ్యానికి నిజమైన నిదర్శనం. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించడం అనేది కేవలం సంఖ్యాబలం మీద కాకుండా, రాజకీయ పక్షాల నైతిక బాధ్యత మీద ఆధారపడి ఉండాలి. మహిళా సాధికారత అనేది ఏ ఒక్క పార్టీకో లేదా ప్రభుత్వానికో పరిమితమైన అంశం కాకూడదు, అది యావత్ భారత జాతి గౌరవంగా, హక్కుగా మారాలి. స్త్రీ పురుష సమానత్వం కేవలం ఉద్యోగాల్లోనే కాదు, దేశ భవిష్యత్తును నిర్ణయించే చట్టసభల్లో కూడా ప్రతిబింబించాలి. మరోవైపు, దేశంలో 'ఒకే దేశం – ఒకే ఎన్నికలు' విధానంపై కూడా తీవ్రమైన చర్చలు జరుగుతున్నాయి. ఇది 2034 నాటికి అమలులోకి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, 2029 ఎన్నికలే ఈ మార్పులకు పునాది కానున్నాయి. ఎన్నికల నిర్వహణ వ్యయం తగ్గించడం, నిరంతరం ఎన్నికల కోడ్ వల్ల ఆగిపోయే అభివృద్ధి పనులకు చెక్ పెట్టడం వంటివి ఈ ప్రతిపాదన వెనుక ఉన్న ఉద్దేశాలు. అయితే, ఈ ప్రక్రియలో ప్రాంతీయ పార్టీల ఉనికి మరియు ప్రాధాన్యత దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. ప్రజాస్వామ్యంలో వైవిధ్యం ఎంత ముఖ్యమో, స్థిరత్వం కూడా అంతే ముఖ్యం. ఈ రెండింటి మధ్య సమతుల్యతను సాధించడమే ప్రస్తుత రాజకీయ సంక్షోభాలకు పరిష్కారం. 2029 ఎన్నికలు భారత పార్లమెంటును ఒక సరికొత్త 'నారీ శక్తి' వేదికగా మార్చబోతున్నాయి. తెరపై కనిపించే గణాంకాల కంటే, విధాన నిర్ణయాల్లో మహిళలు పోషించబోయే క్రియాశీలక పాత్ర దేశ భవిష్యత్తును నిర్దేశిస్తుంది. సామాజిక సమస్యల పట్ల మహిళలకు ఉండే సహజమైన సున్నితత్వం, జవాబుదారీతనం చట్టసభల పనితీరును మరింత మెరుగుపరుస్తాయని ఆశించవచ్చు. రాజకీయ సంకల్పం, పారదర్శకమైన అమలు మరియు రాష్ట్రాల మధ్య సమన్వయం తోడైతే, ఈ నూతన శకం భారత ప్రజాస్వామ్య కీర్తిని ప్రపంచ దేశాల ముందు సగర్వంగా నిలబెడుతుంది. మహిళలు కేవలం వోటర్లుగానే కాకుండా, దేశాన్ని నడిపించే శక్తివంతమైన నాయకులుగా ఎదిగినప్పుడే భారతదేశం 'విశ్వగురువు'గా తన ప్రస్థానాన్ని వేగవంతం చేయగలదు. ఇది కేవలం ఒక బిల్లు ఆమోదం కాదు, ఇది నవ భారత నిర్మాణానికి ఒక బలమైన పునాది.

# పట్టు వీడిన అమెరికా.. మెట్టు దిగని ఇరాన్..



గల్ఫ్ యుద్ధం ప్రారంభమై 25 రోజులైంది. అమెరికా దాడులకు ఐదు రోజుల విరామం ప్రకటించింది. మూడు రోజులు గడిచాయి. అయినా ఇరాన మెట్టు దిగడం లేదు. ఆమెరకు సూచలను కూడా ఇవ్వడం లేదు. అమెరికానే మెట్టుదిగి విరామం ప్రకటించడం ఇరాన్ విజయంగానే భావించాలి. 25 రోజులు అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ఎదుర్కొవడంతోపాటు అమెరికాకు స్థావరాలు ఇచ్చిన గల్ఫ్ దేశాలపై దాడలు చేస్తోంది. సీజ్‌ఫైర్ అని చెబుతున్న అమెరికా 15 కండీషన్లు పెట్టింది. ఈ కండీషన్లకు ఇరాన్ అంగీకరించలేదు.

**ఇరాన్ ఐదు కఠిన డిమాండ్లు**

అణు కార్యక్రమానికి అడ్డంకులు తొలగించాలి. గల్ఫ్‌లో అమెరికా బేస్‌లు మూసివేయాలి. భవిష్యత్ దాడులు చేయమని హామీలు ఇవ్వాలి. హార్మూజ్ మార్గంపై సుంకాలు వసూలుకు అంగీకించాలి. హిజ్బుల్లా రక్షణకు ఇజ్రాయెల్ దాడులు ఆపాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది.

**పాకిస్తాన్ మధ్యవర్తితం ఉత్తదే..**

పాకిస్తాన్ చర్చలకు సిద్ధమైనా, ఇరాన్ పాక్ నౌకను అడ్డుకుని, ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలపై కోపం చూపింది. దీంతో పాకిస్తాన్ మధ్యవర్తిత్వానికి అంగీకరించలేదు. టర్కీ మాత్రం సమాచారం బదిలీల ద్వారా మధ్యవర్తిత్వం చేస్తోంది. ఈజిప్ట్ కూడా సందేశాలు పంపుతోంది. అమెరికా 15 షరతులతో సీజ్‌ఫైర్ ప్రతిపాదించినా, ఇరాన్ తిరస్కరణ యుద్ధాన్ని దీర్ఘకాలికంగా మార్చింది. ఇజ్రాయెల్ భద్రతా ఆందోళనలు, పాక్ చొరవలు క్లిష్టపరుస్తున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో టర్కీ సహాయంతో చర్చలు సాగితే శాంతి ఆవిష్కరణ కావచ్చు, లేకపోతే దాడులు ఊపందుకుంటాయి. రెండు దేశాలు బెట్టు వీడితే శాంతి నెలకొంటుంది. ఏప్రిల్ మొదటివారంలో చర్చలు ముందుకు సాగే అవకాశం ఉంది.

# తెలంగాణ కాంగ్రెస్‌లో నామినేటెడ్ జాతర

## ఏప్రిల్‌లోనే పదవుల పండగ!



తెలంగాణలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చినట్లు కనిపిస్తోంది. పెండింగ్‌లో ఉన్న కార్పొరేషన్ చైర్మన్ పదవులు, ఇతర నామినేటెడ్ పోస్టులపై రాష్ట్ర కాంగ్రెస్ పెద్దలు సుదీర్ఘంగా చర్చించారు. ఇప్పటికే జిల్లాల వారీగా అందిన జాబితాలను అధిష్టానం పరిశీలిస్తోంది. ఈ నియామకాలను ఏప్రిల్‌లో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**నామినేటెడ్ పదవుల భర్తీపై కాంగ్రెస్ వేగం**

తెలంగాణలో నామినేటెడ్ పదవులు, ఇతరాత్రా పదవుల భర్తీకి ఏప్రిల్ నెలలోపే పూర్తి చేయాలని కాంగ్రెస్ హైకమాండ్ భావిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు పదవులు ప్రాసెస్ స్పీడప్ అయిందట. పార్టీ పదవులతో పాటు ప్రభుత్వంలోని నామినేటెడ్ పదవులను కూడా ఈ సారి ప్రకటించాలని ముందుకు సాగుతుందట. నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను కొలిక్కి తీసుకుచ్చేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ పరిశీలకురాలు మీనాక్షి నటరాజన్, మంత్రులు చర్చలు జరుపుతున్నారట.

**కాంగ్రెస్ నేతల లిస్ట్ పరిశీలన**

తాజాగా హైదరాబాద్ కు వచ్చిన ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పార్టీ ఎమ్మెల్యేలు, డీసీసీల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరించారంట. ఫ్రంటల్ వింగ్ ఆర్గనైజేషన్స్ లో ఎవరిని నియమించాలి? ప్రభుత్వ నామినేటెడ్ పదవులకు ఎవరిని సిఫారసు చేయాలి? వంటి అంశాలపై ఏఐసీసీ ఇన్చార్జ్ స్టడీ చేస్తున్నారంట. ఎమ్మెల్యేలు, డీసీసీల నుంచి సేకరించిన లిస్టులపై ఆమె అని కోణాల్లో అధ్యయనం చేస్తున్నారట.

**నామినేటెడ్ పదవుల నిర్ణయం**

ఈసారి పదవుల పంపిణీలో కష్టపడిన వారికే గుర్తింపు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందంట. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమించి, పదవులు ఆశించి భంగపడ్డ ద్వితీయ శ్రేణి నాయకులకు ఈ నామినేటెడ్ పోస్టుల ద్వారా న్యాయం చేయాలని నిర్ణయించారనే టాక్ నడుస్తోంది. ఆయా లీడర్లు పార్టీలో ఎప్పట్నుంచి పనిచేస్తున్నారు? పార్టీ, ప్రభుత్వంపై వారి నిబద్ధత ఎలా ఉంది? కమిట్మెంట్‌తో పనిచేస్తారా? లేదా? పార్టీ పవర్‌లోకి రావడంతో ఆయా లీడర్లు ఏ విధంగా ఉపయోగపడ్డారు? పబ్లిక్‌లో ఆ లీడర్లకు ఎలాంటి స్పందన ఉంది? తదితర అంశాలను క్షేత్రస్థాయి నుంచి క్షుణ్ణంగా వివరాలు తీసుకుంటున్నారట.

**మూడు కేటగిరీల్లో షార్ట్‌లిస్ట్ తయారీ**

హైకమాండ్ కు చేరిన లిస్టుల్లో నుంచి మూడు విధానాల్లో పేర్లను ఫిల్టర్ చేయనున్నారట. పార్టీలో ఏళ్ల తరబడి నుంచి పనిచేస్తున్న లీడర్లు, ఎన్నికల ముందు ఇతర పార్టీల నుంచి చేరిన లీడర్లు, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్టీలోకి వచ్చిన లీడర్లు..ఇలా మూడు కేటగిరీలుగా విభజించి షార్ట్ లిస్టు తయారు చేయనున్నారట. ప్రభుత్వ పనితీరు అద్భుతంగా నిర్వహించినా..క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగం సరిగ్గా లేకపోతే సర్కార్ కు చిక్కులు తప్పవు. దాంతో పదవుల వేగం భర్తీ వేగవంతం చేయాలని ప్లాన్ చేస్తున్నారంట.

**అగ్రనేతల ప్రత్యేక సమావేశం**

ఇప్పటికే ప్రభుత్వం ఏర్పడి రెండున్నర ఏళ్లు గడుస్తుంది. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషిచేసిన క్షేత్రస్థాయి లీడర్లు కూడా చాలా ఓపికగా పదవుల కోసం వెయిట్ చేస్తున్నారు. ఇప్పటికీ ప్రకటించకపోతే, పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉందని ఏఐసీసీ గుర్తించిందంటున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా సీఎం, పీసీసీ చీఫ్, ఏఐసీసీ ఇన్చార్జ్‌లతో అగ్రనాయకత్వం ప్రత్యేకంగా మాట్లాడి ఆదేశాలిచ్చిందంట. అందులో భాగంగానే ప్రభుత్వం, పార్టీలోని పదవులను ఏప్రిల్ నెల చివరి వరకు పూర్తి చేయాలని భావిస్తున్నారట.

**పదవుల భర్తీపై కాంగ్రెస్ ప్లాన్**

స్టేట్ నుంచి జిల్లా స్థాయి వరకు ఖాళీగా ఉన్న పదవులన్నీ భర్తీ చేసేలా వర్క్ చేస్తున్నారట. ప్రధానంగా పార్టీ లోని చైర్మన్లు, ప్రభుత్వంలోని కార్పొరేషన్ చైర్మన్లు, ప్రభుత్వ సలహాదారులు, డైరెక్టర్లు, మార్కెట్ కమిటీలు తదితర పదవులన్నీ ఈ సారి భర్తీ చేయనున్నట్లు గాంధీభవర్ వర్గాలు చెప్తున్నాయి. ఇక పార్టీలోని డీసీసీ పరిధిలో మిగిలిన జనరల్ సెక్రటరీలు, సెక్రటరీలు, ట్రెజరర్ లు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు వంటి పదవులను కూడా ప్రకటించేందుకు కసరత్తు జరుగుతోందట.

**గ్రౌండ్ లెవల్ రిపోర్ట్ సేకరణ**

పదవుల భర్తీలో ఏఐసీసీ ఇన్చార్జ్ నేతృత్వంలో ఇప్పటికే కసరత్తు ముమ్మరమైంది. కేవలం పైస్థాయి రికమండేషన్లకే పరిమితం కాకుండా, గ్రౌండ్ లెవల్ రిపోర్ట్ కోసం ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షుల నుంచి ప్రతిపాదనలు సేకరించారట. కష్టకాలంలో పార్టీని నమ్ముకుని ఉన్న వారు...గత ఎన్నికల్లో గెలుపు కోసం శ్రమించిన ద్వితీయ శ్రేణి నాయకులకు ఈసారి పెద్దపీట వేయనున్నారు.

**గ్రామం నుంచి గాంధీభవన్ వరకు పూర్తి ప్రాసెస్**

దీంతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నేతలకు పక్కాగా పదవులు దక్కేలా ఏఐసీసీ చర్యలు తీసుకోవాలని చెప్పడంతో ఆ దిశగా ఎక్సర్‌సైజ్ చేస్తున్నారంట. ఇప్పటికే దాదాపు 70 శాతం జాబితా రెడీ అయిందని, మరో 30 శాతం పేర్లు ఫైనల్ కాగానే ప్రకటిస్తామని ప్రభుత్వంలోని ఓ సీనియర్ నేత తెలిపారు. గ్రామ స్థాయి నుంచి గాంధీభవన్ వరకు,మండల స్థాయి నుంచి ముఖ్యమైన శాఖల వరకు నామినేటెడ్ పదవుల భర్తీని కూడా ఈ దఫా పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.

# రేవంత్ తీరు.. కాంగ్రెస్‌కు కత్తిమీద సాము..




తెలంగాణ గడ్డపై పాలనతో బిజీగా ఉండే సీఎం రేవంత్ రెడ్డి హస్తినలో అడుగుపెట్టగానే రూటు మారుస్తున్నారు. జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పేందుకు ఆయన ఎంచుకున్న సరికొత్త ఆయుధం 'డీలిమిటేషన్' (నియోజకవర్గాల పునర్విభజన). దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలే పరమావధిగా ఆయన వినిపిస్తున్న నినాదం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది.

**దక్షిణాదికి శిక్షేనా? రేవంత్ లాజిక్ ఇదే!**

నియోజకవర్గాల పునర్విభజన జరిగితే జనాభా ప్రాతిపదికన సీట్ల సంఖ్య పెరుగుతుంది. ఇక్కడే రేవంత్ రెడ్డి ఒక బలమైన పాయింట్‌ను తెరపైకి తెచ్చారు. దక్షిణాది రాష్ట్రాలు దశాబ్దాలుగా కేంద్రం చెప్పినట్లు కుటుంబ నియంత్రణను పాటించి జనాభాను అదుపు చేశాయి. కానీ, ఇప్పుడు జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకే ఎక్కువ ఎంపీ సీట్లు కేటాయిస్తే, అది క్రమశిక్షణ పాటించిన దక్షిణాదికి అన్యాయం చేసినట్లే అవుతుంది. "అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు శిక్ష.. జనాభా పెంచిన వారికి బహు మతా?" అన్న రేవంత్ ప్రశ్న ఇప్పుడు దక్షిణ భారతాన్ని ఆలోచింపజేస్తోంది.

**కాంగ్రెస్ హైకమాండ్‌కు కత్తి మీద సాము!**

రేవంత్ రెడ్డి తీస్తున్న ఈ 'సౌత్ సెంటిమెంట్' కాంగ్రెస్ అధిష్టానాన్ని ఇరకాటంలో పడేస్తోంది. నార్త్ వర్సెస్ సౌత్ గా పరిస్థితి మారుతోంది. రేవంత్ వ్యాఖ్యలను గట్టిగా సమర్థిస్తే.. ఉత్తరాది రాష్ట్రాల్లోని ఓటర్లు తమను కించపరుస్తున్నారని భావించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా రాహుల్ గాంధీ ఉత్తరాదిన పార్టీని బలోపేతం చేయాలని చూస్తున్న తరుణంలో ఈ ప్రాంతీయ భేదాలు పార్టీ జాతీయ ప్రతిష్టకు విఘాతం కలిగించవచ్చు. అందుకే రేవంత్ దూకుడుపై అధిష్టానం ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ముద్ర వేయకుండా ఆచితూచి అడుగులు వేస్తోంది.

**'తెలంగాణ ఫస్ట్'.. రేవంత్ మార్క్ పాలిటిక్స్**

గతంలో కేసీఆర్ కూడా జాతీయ రాజకీయాల కోసం 'బీఆర్ఎస్' పెట్టి చేతులు కాల్చుకున్నారని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. అయితే రేవంత్ వ్యూహం భిన్నంగా ఉంది. ఆయన కేవలం పార్టీ లైన్ కాకుండా ప్రాంతీయ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారు. దక్షిణాది ఎంపీల సంఖ్య తగ్గితే భవిష్యత్తులో కేంద్రం నుంచి వచ్చే నిధులు, రాజకీయ ప్రాతినిధ్యం కూడా తగ్గిపోతాయని ఆయన హెచ్చరిస్తున్నారు. కేసీఆర్ మాదిరిగా ఉత్తరాదిలో పార్టీని విస్తరించడం కంటే, దక్షిణాది నేతలను ఏకం చేసి కేంద్రంపై ఒత్తిడి తేవడమే రేవంత్ అసలు ప్లాన్ అని అర్థమవుతోంది.

**బీజేపీకి చిక్కుముడి.. కాంగ్రెస్‌కు సవాల్!**

ఉత్తరాదిన తిరుగులేని బలం ఉన్న బీజేపీకి, రేవంత్ లేవనెత్తిన ఈ అంశం పెద్ద తలనొప్పిగా మారే అవకాశం ఉంది. ఒకవేళ దక్షిణాది రాష్ట్రాలు నిజంగానే ఏకతాటిపైకి వస్తే, అది బీజేపీకి దక్షిణాదిన అడ్డుగోడగా మారుతుంది. అయితే, ఇదే సమయంలో రేవంత్ వ్యాఖ్యలను బీజేపీ తమకు అనుకూలంగా మలుచుకుని "కాంగ్రెస్ దేశాన్ని విభజిస్తోంది" అనే ప్రచారాన్ని నార్త్ ఇండియాలో మొదలుపెట్టే ఛాన్స్ కూడా ఉంది. రేవంత్ రెడ్డి ఎంచుకున్న ఈ 'దక్షిణ సెంటిమెంట్' రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తోంది. ఇది కేవలం సీట్ల పెంపు అంశమే కాదు.. భవిష్యత్తు భారత రాజకీయాల గమనాన్ని మార్చే కీలక పరిణామం. రేవంత్ రెడ్డి ఈ పోరాటంలో దక్షిణాది రాష్ట్రాలను ఏకం చేయగలరా? లేదా జాతీయ రాజకీయాల ఒత్తిడిలో తన స్వరాన్ని తగ్గించుకుంటారా? అనేది కాలమే నిర్ణయించాలి.

## బెంగాల్ ఎన్నికల యుద్ధం..

# పాలకులను నిర్ణయించేంది వారే!



సరిగ్గా నెల రోజుల తర్వాత ఎన్నికలు జరుగనున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ నాలుగోసారి విజయం సాధించాలనిచూస్తోంది. బీజేపీ త్రణమూల్‌కు బ్రేక్ వేయాలని చూస్తోంది. బెంగాల్ రాజకీయాలను శాసించే కీలకమైన శక్తి ముస్లిం సమాజం. బెంగాల్ రాజకీయాలను ఏడు దశాబ్దాలుగా శాసిస్తున్నారు.

**రెట్టింపైన ముస్లిం ఓట్లు..**

పశ్చిమ బెంగాల్‌లో ముస్లిం జనాభా 1951లో 19.6 శాతం ఉండేవారు. ప్రస్తుతం 33 శాతానికి పెరిగారు. అంటే దాదాపు రెట్టింపు అయ్యారు. 85 స్థానాల్లో వీరే విజేతలను నిర్ణయిస్తారు, మరో 30–40 సీట్లలో ప్రభావం చూపుతారు. మొత్తం 120 నియోజకవర్గాల్లో వారి ఆధిపత్యం రాజకీయాలను శాసిస్తుంది.

**ఆ జిల్లాల్లో ప్రభావం..**

ముర్షీదాబాద్‌లో 46 శాతం, మాల్దాలో 51 శాతం, పశ్చిమ దినాజ్‌పూర్‌లో 50 శాతం, వీర్‌భూమిలో 50 శాతం, దక్షిణ 24 పర్గణాల్లో 30 శాతం ముస్లిం ఓటర్లు ఉన్నారు. ఈ ప్రాంతాల్లో 85 స్థానాల్లో ముస్లిం అభ్యర్థులనే పార్టీలు బరిలో దింపుతాయి. వారే గెలుస్తారు. మరో 30 స్థానాల్లో ముస్లింల మద్దతుతో ఇతర మతాల అభ్యర్థులు గెలుస్తారు. ముస్లింలు ఓట్లు వేయకుంటే ఓడిపోతారు.

**చారిత్రక ఓటు మార్పులు**

దేశ విభజన తర్వాత కాంగ్రెస్, తర్వాత కమ్యూనిస్టుల వైపు ముస్లిం ఓట్లు మళ్లాయి. భూసంస్కరణలు, పాఠ్యపుస్తకాల మార్పులు, ఓబీసీలో 66 ముస్లిం కులాలు చేర్చడం ద్వారా వారిని బలోపేతం చేశారు. 2011 నుంచి తృణమూల్ వైపు మళ్లారు. ఇటీవల 36 ఉపకులాలను బీసీలో చేర్చి 35 ముస్లింలవి, ఉర్దూ రెండో అధికారిక భాషగా గుర్తింపు, ఇమామ్‌లకు వేతనాలు ప్రకటించింది. 2006లో కమ్యూనిస్టులు 102, 2021లో తృణమూల్ 95 సీట్లు ఈ ఓట్లతోనే గెలిచాయి.

**ముస్లిం పార్టీల సవాల్..**

ఎంఐఎం, ఐఎస్ఎఫ్ (ఇమామ్ అబ్బాస్), ఆల్ జనతా ఉనయన్ (మాజీ ఎంపీ ప్రారంభం) పార్టీలు ఈసారి అభ్యర్థులను పోటీలో దించాయి. ముస్లిం బలంగా ఉన్న ప్రాంతాల్లో వీటి ప్రభావం టీఎంసీ సీట్లను 20 వరకు తగ్గించే అవకాశం ఉంది. ఈసారి ఎన్నికల్లో టీఎంసీకి బీజేపీ బ్రేక్ చేయాలని చూస్తోంది, ముస్లిం ఓట్ల చీలిక ఇందుకు దోహదపడే అవకాశం ఉంది. 20 మంది ముస్లింలు గెలిస్తే ఫలితాలు మారతాయి. ముస్లిం పార్టీల పోటీ ఓటు బ్యాంకును విభజించి, బెంగాల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం రాస్తాయి.

# పశ్చిమాసియా సంక్షోభం.. భారత పర్యాటకానికి ఊతం!



భారత్ అత్యంత సుందరమైన దేశం. మన దేశంలో చారిత్రక, పర్యాటక ప్రదేశాలు చాలా ఉన్నాయి. ఏటా లక్షల మంది మన దేశానికి పర్యాటకులుగా వస్తున్నారు. మన దేశీయులు కూడా ఏటా సెలవుల్లో పర్యాక, పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్తుంటారు. మన దేశం నుంచి కూడా విదేశాలకు వెళ్తుంటారు. అయితే తాజగా పశ్చిమాసియా యుద్ధ భయాలు గల్ఫ్ దేశాల సందర్శనలకు బ్రేక్ పడింది. 40–50 శాతం పర్యాటకులు తగ్గారు. భద్రతా ఆందోళనలతో విమాన టికెట్లు, హోటళ్ల రద్దులు పెరిగాయి. దీని ప్రభావంతో భారతీయుల వేసవి ప్రణాళికలు మారుతున్నాయి.

**దేశీయ ప్రాంతాలకు డిమాండ్..**

హిమాచల్, ఉత్తరాఖండ్, లద్దాఖ్ ప్రాంతాల్లో బుకింగులు 30 శాతం పుంజుకున్నాయి. రిషికేశ్, షిల్లాంగ్, మనాలీలో చల్లని వాతావరణం వేసవి సెలవులకు ఆకర్షణగా మారాయి. 65% పర్యాటకులు దేశీయ ప్రదేశాలను ఎంచుకుంటున్నారు.

**ఆధ్యాత్మిక పర్యటనలకు ప్రాధాన్యం..**

దేశంలో 23 శాతం మంది ఆధ్యాత్మిక కేంద్రాల వైపు మొగ్గ చూపుతున్నారు. హరిద్వార్, బద్రీనాథ్, కైలాస్ మానసరోవర్ మార్గాలు జనాదరణ పొందుతున్నాయి. ఈ మార్పు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలకు పునరుజ్జీవనం తీసుకొస్తోంది.

**ప్రత్యామ్నాయ దేశాలకు..**

ఇక విదేశాలకు వెళ్లాలనుకునేవారు గల్ఫ్ దేశాలకు ప్రత్యామ్నాయంగా వియత్నాం, నేపాల్, శ్రీలంక, థాయ్‌లాండ్, ఇండోనేసియా వెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. దీంతో ఆయా దేశాలకు టూర్ డిమాండ్ 25 శాతం పెరిగింది. ట్రావెల్ ఏజెన్సీలు ఈ దేశాల్లో ప్యాకేజీలను తగ్గించి, భారతీయులను ఆకర్షిస్తున్నాయి. స్వదేశ పర్యటన పెరుగుదల హోటళ్లు, రవాణా, స్థానిక వ్యాపారాలకు రూ.15 వేల కోట్ల ఆదాయం వస్తుంది. గల్ఫ్ రద్దులు దేశీయ టూరిజానికి బూస్ట్ ఇచ్చింది. టోల్ ఫీజు పెరుగుదల, మొహర్ ప్రమాదాలు సవాళ్లుగా మిగిలాయి. దీర్ఘకాలంలో ఇది టూరిజం వైవిధ్యీకరణకు దారి తీస్తుంది.

## శ్రీ రామనవమి సందర్భంగా రామాలయంలో జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు



మెదక్, మార్చి 27 (పోలీస్ నిఘా) : మెదక్ శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ రోజు మెదక్ టౌన్‌లోని శ్రీ రామాలయంలో జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాసరావు, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఎస్పీ అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, వేదమంత్రాల నడుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీరాముడిని దర్శించుకుని జిల్లా ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, జిల్లాలో శాంతి భద్రతలు మెరుగ్గా ఉండాలని ప్రార్థించారు. అలాగే సమాజంలో ఐక్యత, శాంతి వాతావరణం నెలకొనాలని ఆకాంక్షించారు. పూజల అనంతరం అర్చకులు ఎస్పీ తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీరామనవమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పగడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ టౌన్ సీఐ మహేష్, పోలీసు సిబ్బంది, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి పట్టణ కురుమ సంఘ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం



మెట్‌పల్లి, మార్చి 27 (పోలీస్ నిఘా) : మెట్ పల్లి పట్టణ కురుమ సంఘం వారి ఆధ్వర్యంలో నిన్న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోకోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కురుమ సోదరుల సాంప్రదాయాల పండుగలపై ఇటీవల బీరప్ప స్వామి పండుగలో కేసు జరిగిన దృశ్య అసెంబ్లీ సమావేశంలో ముఖ్యమంత్రి దృష్టికి మంత్రివర్గ దృష్టికి రాష్ట్ర తెలంగాణ ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లిన సందర్భంగా కేసును ఉపసహరించుకోవాలని ముఖ్యమంత్రిని కోరిన ప్రియతమా నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఫ్లెక్సీ ఫోటోకు మెట్పల్లి పట్టణ కురుమ సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. అనంతరం కురుమ సంఘం అధ్యక్షులు కోరే రమేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గారు కురుమ సాంప్రదాయాలపై అవగాహనతో అసెంబ్లీలో మాట్లాడి అందరి మనోభావాలు అర్థం చేసుకునేలా ప్రతి ఒక్క కుల సంప్రదాయ పండుగలకు ఆటంకం కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో అందరిని అన్ని వర్గాలకు తెలియజేసినట్టు అలాగే మా కురుమ సంప్రదాయ పండుగ జరిగిన సంఘటనను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీలో మాట్లాడినందుకు ఆయనకు కురుమ సంఘం తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షులు కోరే రమేష్ రాష్ట్ర నాయకులు కోట రమేష్ కోట కోటమహేష్ కోట సురేష్ కోట కుమార్ కోరే భూమయ్య కోరే జైపాల్ గడ్డం మల్లేష్ కోట నరసింహులు కోట ప్రసాద్ కోరే నరేష్ సిరా గంగారం కురుమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## వెంకటరావుపేటలో మహా అన్నదానం



మల్లాపూర్, మార్చి 27 (పోలీస్ నిఘా) : మల్లాపూర్ మండలంలోని వెంకటరావుపేట గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా హనుమాన్ టెంపుల్ ఆవరణలో హనుమాన్ గణేష్ మండలి వారి ఆధ్వర్యంలో మహా అన్నదాన ప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేశారు. సభ్యులు మాట్లాడుతూ ఇట్టి కార్యక్రమానికి సహకరించిన దాతలు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాములోరి కళ్యాణానికి హాజరైన హనుమాన్ భక్తులు



చేవెళ్ల, మార్చి 27 (పోలీస్ నిఘా) : రాములోరి కళ్యాణానికి హనుమాన్ భక్తులుగా హాజరుకావడం మా అదృష్టంగా భావిస్తున్నాం అని దీక్షపరులు తెలిపారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరగిద్ద వార్డులో ఉన్న రామాలయంలో శ్రీ సీతారాముల వారి కళ్యాణాన్ని గ్రామ పెద్దలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే హనుమాన్ దీక్ష తీసుకున్న దీక్షపరులు హాజరై కళ్యాణంలో పాల్గొన్నారు. ఈ పవిత్ర దినాన స్వామివారిని దర్శించుకోవడం ఎంతో భాగ్యంగా భావిస్తున్నామని నియమ నిష్ఠలతో దీక్ష కొనసాగిస్తూ శ్రీరాముడి కృప పొందాలని కోరుకుంటున్నాం అని దీక్షపరులు తెలిపారు. వారు సమూహంగా జయ నినాదాలతో ఆలయానికి చేరుకోవడంతో ఆధ్యాత్మికతతో సంతరించుకుంది.

# వదంతులు నమ్మొద్దు

**మెదక్ జిల్లాలో గ్యాస్, ఇంధన కొరత లేదు: కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్, మార్చి 27 (పోలీస్ నిఘా) : మెదక్ జిల్లా శుక్రవారం మెదక్ జిల్లాలో గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎటువంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. వదంతులను నమ్మకుండా ప్రజలు ప్రశాంతంగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఎల్పిజి గ్యాస్ సరఫరా సమృద్ధిగా కొనసాగుతోందని తెలిపారు. రోజుకు సుమారు 3000 సిలిండర్లు బుక్ అవుతుండగా, వాటికి 100 శాతం డెలివరీ జరుగుతోందన్నారు. ప్రస్తుతం జిల్లాలోని గ్యాస్ గోదాముల్లో సుమారు 3500 సిలిండర్లు నిల్వ ఉండగా, మరో 6500 సిలిండర్లు రవాణాలో ఉన్నాయని వివరించారు. అలాగే జిల్లాలో మొత్తం 87 పెట్రోల్ బంకులు, 16 ఎల్పిజి ఏజెన్సీలు సక్రమంగా పనిచేస్తున్నాయని తెలిపారు. రోజువారీ అవసరానికి సరిపడా ఇంధనం నిల్వలో ఉందని, ప్రస్తుతం 550 కిలో లీటర్ల పెట్రోల్, 644 కిలోలీటర్ల డీజిల్ అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. కొన్ని బంకుల వద్ద కనిపిస్తున్న క్యూలు వదంతుల ప్రభావంతో ప్రజలు అవసరానికి మించి ఇంధనం కొనుగోలు చేయడం వల్లే ఏర్పడుతున్నాయని చెప్పారు. అవసరం ఉన్నప్పుడే ఇంధనం తీసుకోవాలని సూచించారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో సివిల్ సప్లైస్, పోలీస్, రెవెన్యూ శాఖల సంయుక్త బృందాలు తనిఖీలు నిర్వహించాయి. మెదక్ పట్టణంలోని పలు హోటళ్ల, రెస్టారెంట్లలో తనిఖీలు చేసి గృహ వినియోగానికి ఉద్దేశించిన 14.2 కేజీల 134 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసి, 83 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజలు సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్‌లో వచ్చే నిర్ధారణలేని సమాచారాన్ని నమ్మవద్దని, అధికారిక ప్రకటనలనే విశ్వసించాలని కలెక్టర్ సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 9391942254 ను సంప్రదించవచ్చని తెలిపారు. వాస్తవాలను గ్రహిద్దాం ఆందోళనను వీడుదాం. అవసరానికి మించి నిల్వలు చేయవద్దు" అని కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

# ప్రమాదకరంగా విద్యుత్ మీటర్


**ప్రాథమిక పాఠశాల ఎదుటే నిర్లక్ష్యం**

**భూమికి అడుగు ఎత్తులో విద్యుత్ మీటర్**

**చిన్నారుల ప్రాణాలకు ముప్పు**

**అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం**





వేములవాడ, మార్చి 27 (పోలీస్ నిఘా) : వేములవాడ గాంధీనగర్లో ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ మీటర్ స్థానికుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. కప్పు లేకుండా పూర్తిగా దెబ్బతిన్న ఈ విద్యుత్ మీటర్ కు ఎదురుగానే ప్రాథమిక పాఠశాల ఉండటంతో చిన్నారుల భద్రతపై తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. భూమికి కేవలం ఒక అడుగు ఎత్తులో ఉన్న ఈ మీటర్ పక్కన పాఠశాల విద్యార్థులు నిత్యం తిరగడంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు ఆటల సమయంలో అనుకోకుండా తాకితే ప్రాణాపాయం సంభవించే పరిస్థితి ఉందని వారు చెబుతున్నారు. ఇదే ప్రాంతంలో విద్యుత్ స్తంభం వద్ద ఎల్లప్పుడూ నీరు నిల్వ ఉండటంతో ప్రమాద తీవ్రత మరింత పెరుగుతోందని స్థానికులు తెలిపారు. ఈ సమస్యను పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసు కెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని వారు ఆరోపిస్తున్నారు. ఏదైనా అపశృతి జరిగితే బాధ్యత ఎవరిది? ప్రమాదం జరిగిన తర్వాతే అధికారులు స్పందిస్తారా? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ మీటరు తగిన రక్షణ కవచం ఏర్పాటు చేసి, చిన్నారుల ప్రాణాలను కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఖమ్మం జిల్లాలో మిన్నంటిన రామ నామ స్మరణ

**సీతారాముల కళ్యాణ వేడుకల్లో పాల్గొన్న బిజెపి నేతలు**

**ధర్మ పరిరక్షణే లక్ష్యంగా అడుగులు వేయాలి**

**బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు పిలుపు**






ఖమ్మం, మార్చి 27 (పోలీస్ నిఘా) : మర్యాద పురుషోత్తముడు శ్రీరామచంద్రుని జన్మదినం మరియు సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం జిల్లా వ్యాప్తంగా శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, కనులపండువగా జరిగాయి. ఈ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా జరిగిన ఈ వేడుకల్లో భాగంగా ఆయన తొలుత ఖానాపురం హవేలిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇందిరా నగర్ రామాలయాన్ని దర్శించి స్వామివారి ఆశీస్సులు అందుకున్న ఆయన, అక్కడ జరుగుతున్న వేడుకలను పర్యవేక్షించి భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా అనంతారం గ్రామంలో నిర్వహించిన శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం భక్తుల జయజ ధ్వానాల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఈ కళ్యాణ వేడుకల్లో పాల్గొన్న నెల్లూరు కోటేశ్వరరావు ప్రత్యేక హారతులను భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వేడుకలను నిర్వహిస్తున్న శ్రీరామనవమి కమిటీ సభ్యులను, హిందూ బంధువులను ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. రామరాజ్య స్థాపన లక్ష్యంగా, ధర్మ పరిరక్షణ దిశగా అడుగులు వేస్తున్న ప్రతి ఒక్కరి కృషి ఎంతో గొప్పదని ఆయన కొనియాడారు. హైదరాబాద్ కేంద్రంగా భారతీయ ధర్మాన్ని, సంస్కృతిని ముందుకు తీసుకుపోవడంలో అహర్నిశలు శ్రమిస్తున్న కమిటీ సభ్యుల కృషిని ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించి వారిని ప్రశంసించారు. జిల్లా ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలుపుతూ, శ్రీరాముడి ఆశీస్సులతో జిల్లాలోని ప్రతి ఇల్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా బీజేపీ నాయకులు అల్లిక అంజయ్య, ఆచంటి కోటేశ్వరరావు, వాకదాని రామకృష్ణ కార్యకర్తలు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని రామనామ స్మరణతో జిల్లాను భక్తిమయం చేశారు.

## ఎన్ఎస్ఎస్ దత్తత గ్రామాల్లో స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు




సంగారెడ్డి, మార్చి 27 (పోలీస్ నిఘా) : తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డి ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో దత్తత గ్రామాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శీతాకాల శిబిరాల్లో భాగంగా స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. కల్పకూర్, అంగడిపేట గ్రామాలలో 90 మంది విద్యార్థులతో, మల్కాపూర్ గ్రామంలో 45 మంది బాలికలతో కొనసాగుతున్న శిబిరాల మూడవ రోజున స్వచ్ఛత సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం కల్పించారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని కల్పకూర్ గ్రామంలోని కాశీ విశ్వేశ్వర ఆలయం మరియు పరిసర ప్రాంతాలను విద్యార్థులు శుభ్రపరిచారు. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి, దేవాలయం పరిసరాలను పర్వదినానికి అనుగుణంగా పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. అలాగే మల్కాపూర్ గ్రామంలో ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలల పరిసరాలను విద్యార్థులు శుభ్రం చేసి పరిశుభ్రత ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. స్వచ్ఛమైన పరిసరాల ద్వారా అంటువ్యాధులను నివారించవచ్చని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పరిశుభ్రత కీలకమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛత ఎంతో దోహదపడుతుందని, కాలుష్యాన్ని తగ్గించడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాల ద్వారా గ్రామాల్లో స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వాలంటీర్లు కృషి చేస్తున్నారని తెలిపారుఈ కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ్ కుమార్, డాక్టర్ వాణి పాల్గొన్నారు. కల్పగూర్‌లో ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి మల్లేష్, సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మల్కాపూర్‌లో ఉన్నత పాఠశాల హెచ్ఎం యాదగిరి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సర్పంచ్, ఉపసర్పంచ్‌లు మరియు గ్రామ పెద్దలు విద్యార్థులకు మద్దతు అందించారు.

## శ్రీరామచంద్రుడి కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలి

**తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి**

**తీదేడు గ్రామంలో అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం**




దేవరకొండ, మార్చి 27 (పోలీస్ నిఘా) : శ్రీరామచంద్రుడి కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. చింతపల్లి మండలం తీదేడు గ్రామం రామాలయంలో శ్రీరామనవమి పురస్కరించుకుని సీతా రాములవారి కళ్యాణోత్సవం కన్నుల పండుగగా సాగింది. వేద పండితుల మంత్రోచ్చరణలు, వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా అంగ రంగ వైభవంగా సీతారాముల కళ్యాణం జరిగిందని సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..లోక కళ్యాణం కోసం ఎన్నోత్యాగాలను కోర్చిన సీతారాముల పవిత్ర బంధం అజరామరమైనదని, రాబోయే తరాలకు ఆదర్శనీయమైనదని ఆమె తెలిపారు. సీతారాముల ఆశీస్సులు అందరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవనం సాగించేలా దీవించాలని సీతారామచంద్రమూర్తులను ప్రార్థించనున్నట్టు ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి అని ఆమె అన్నారు. దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలక వర్గం, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 10 మంది తహసీల్దార్ల బదిలీలు

**వెలుగుమట్ల వ్యవహారంలో ఎట్టకేలకు బదిలీ?**

**ఖమ్మం అర్బన్ తాసిల్దార్ బదిలీ..**

**జీవో విడుదల చేసిన జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్**




ఖమ్మం, మార్చి 27 (పోలీస్ నిఘా) : డి జయచందర్ చింతకాని నుంచి ఖమ్మం అర్బన్ బదిలీ బ్రహ్మేశ్వరరావు తల్లాడ నుంచి కల్లూరు కు బదిలీ పి సాంబశివుడు కల్లూరు నుంచి కలెక్టరేట్ కు బదిలీ వినేందర్ రెడ్డి సింగరేణి నుంచి ఖమ్మం రూరల్ కు వదిలి కూసుమంచి తహసీల్దార్ గా డి. సైదులు.. రవి కుమార్ కూసుమంచి నుంచి ముదిగొండ తహసిల్దారుగా బదిలీ సునీత ఎలిజిబెత్ ఖమ్మం కలెక్టరేట్ కి బదిలీ నేలకొండపల్లి తాసిల్దార్గా రాంప్రసాద్ బదిలీ ఖమ్మం రూరల్ తహసిల్దార్ గా వినయేందర్ రెడ్డి, సింగరేణి మండలం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అనంతుల. రమేష్ ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారి అయ్యాయి.. ఆయనను గతంలో పనిచేసిన కల్లూరు మండలం డిఏఓ (కల్లూరు సబ్ కలెక్టరు ఆఫీస్ లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తన పదవీకాలంలో అనంతుల రమేష్ ప్రజలకు అందుబాటులో ఉండి, వివిధ సమస్యల పరిష్కారంలో చురుకుగా పనిచేశారు.

# డ్రగ్స్ విక్రేతలు, వినియోగదారుల అరెస్ట్

## రూ. 6,00,000 విలువైన (60) గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం

హైదరాబాద్, మార్చి 27 (పోలీస్ నిఘా) : హైదరాబాద్‌లోని అవసరమున్న కస్టమర్లకు విక్రయించే ఉద్దేశంతో నిషేధిత మాదకద్రవ్యం కలిగి ఉన్న ఇద్దరు నేరస్తులను మరియు ఇద్దరు జేసీఎల్ లను హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్ ఫోర్స్ (జూబ్లీహిల్స్ జోన్ టీమ్), సనత్ నగర్ పోలీసులతో కలిసి సంయుక్తంగా అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 60 గ్రాముల ఎండీఎంఏ మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.



నిందితుల వివరాలు: సోంగపు హేమంత్, తండ్రి: శివరాజ్, వయస్సు: 23 సం॥, వృత్తి: విద్యార్థి, నివాసం: హెచ్.నెం. 26-13, వెంకటరమణ రెడ్డి నగర్, ఐడిపిఎల్ (ఎఆఖఎ), హైదరాబాద్. (వినియోగదారుడు)

ముక్కగళ్ల నాగేంద్ర, తండ్రి: ఎం. స్వామి, వయస్సు: 21 సం॥, నివాసం: హెచ్.నెం. 7-78, అంబేద్కర్ నగర్, చింతల్, కుత్బుల్లాపూర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా. (వినియోగదారుడు)

తప్పించుకున్న నిందితులు: సాయి నిఖిల్ యాదవ్, ఆదిత్య

స్వాధీనం చేసుకున్న వస్తువులు: సుమారు 60 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్.

దీని మొత్తం విలువ సుమారు రూ. 6,00,000/-.

కేసు వివరాలు: పట్టుబడిన నిందితులకు మరియు జేసీఎల్‌లకు మద్యం, గంజాయి మరియు ఎండీఎంఏ సేవించే అలవాటు ఉంది. ఈ క్రమంలో చింతల్‌లో నివసించే ఆదిత్య మరియు సాయి నిఖిల్ యాదవ్‌లతో ఒక జేసీఎల్‌కు పరిచయం ఏర్పడింది. వారి వద్ద ఎండీఎంఏ డ్రగ్ ఉందని తెలుసుకున్న సదరు జేసీఎల్, వారి వద్ద నుండి తక్కువ ధరకు డ్రగ్ కొనుగోలు చేసి, తెలిసిన కస్టమర్లకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. రెండు రోజుల క్రితం, ఆదిత్య మరియు సాయి నిఖిల్ యాదవ్‌ల నుండి 60 గ్రాముల ఎండీఎంఏను కొనుగోలు చేసి, కస్టమర్లకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

అరెస్టయిన నిందితులను, స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను తదుపరి చర్యల నిమిత్తం సనత్ నగర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ ఆపరేషన్ జూబ్లీహిల్స్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ చ. యదేందర్, ఎస్.ఐ.పి. డి. రవిరాజ్ మరియు వారి బృందం, సనత్ నగర్ పోలీసులతో కలిసి పర్యవేక్షించారు.

# గోదావరి పుష్కరాలు నాటికి భద్రాచలం ఆలయ తొలి దశ పనులు పూర్తి



భద్రాచలం, మార్చి 27 (పోలీస్ నిఘా) : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంకల్పంతో రూ.351 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థాన అభివృద్ధిపై కీలక ప్రకటన చేశారు. రాబోయే గోదావరి పుష్కరాలు నాటికి ఆలయ తొలి దశ అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. శుక్రవారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, ఈ క్షేత్రానికి దేశవ్యాప్తంగా విశేషమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం కోట్లాది మంది భక్తులు శ్రీ సీతారాముల కళ్యాణాన్ని వీక్షిస్తారని తెలిపారు. మంత్రిగా మూడో సంవత్సరంలో ఈ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో భద్రాచలం ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె వెల్లడించారు. డిప్యూటీ సీఎం, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో అవసరమైన భూసేకరణ పూర్తి చేసిన అనంతరం రూ.351 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం చేపట్టిన పనులను పుష్కరాల సమయానికి పూర్తిచేయడానికి దేవాదాయ శాఖ చర్యలు చేపడుతుందని, అనంతరం రెండో విడత నిధులు విడుదల చేసి కృష్ణ పుష్కరాలు నాటికి అన్ని పనులను పూర్తి చేస్తామని తెలిపారు. కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించిన భక్తులందరికీ శ్రీ రామచంద్ర స్వామి ఆశీస్సులు ఉండాలని, ప్రజా ప్రభుత్వానికి మరింత శక్తి కల్పించాలని మంత్రి ఆకాంక్షించారు.

# ఆ టెండర్ను రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం

- తక్షణమే 9, 10 షాపుల టెండర్ను రద్దు చేయాలి
- దేవస్థానం ఆదాయానికి గండి కొడుతున్న వైనం
- బిఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి



యాదగిరిగుట్ట, మార్చి 27 (పోలీస్ నిఘా) : యాదగిరిగుట్ట దేవస్థానం ఆదాయానికి గండి కొడుతున్నారు అని పాపట్ల నరహరి అన్నారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో ఇటీవల నిర్వహించిన ఓ టెండర్ దేవస్థానానికి తీవ్ర నష్టం జరిగేలా ఉందని తక్షణమే ఈ టెండర్ను రద్దు చేయాలని కోరుతూ బిఆర్ఎస్ యాదగిరిగుట్ట పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి ఆధ్వర్యంలో శుక్రవారం యాదగిరిగుట్ట దేవస్థానం ఈవో భవాని శంకర్ కు వినతి పత్రం అందజేశారు. కొండ కింద లక్ష్మి పుష్కరిణి వద్ద 9, 10 నెంబర్లు గల దుకాణాలలో కూల్డ్రింక్స్ ఐస్ క్రీమ్స్ బనియన్స్ టవల్స్ విక్రయించేందుకు ఇటీవల నిర్వహించిన టెండర్ను టెండర్దారులు సిండికేట్ గా మారి తక్కువ మొత్తంలో దక్కించుకున్నారని పాపట్ల నరహరి ఆరోపించారు. గతంలో కంటే 75% తగ్గించి తక్కువ మొత్తానికి అద్దెకు ఇవ్వడం వల్ల దేవస్థానం నష్టపోతుందని అన్నారు. దీనివల్ల గతంలో కంటే దేవస్థానానికి తక్కువ ఆదాయం వచ్చి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. దీనిపై విచారణ జరిపి ఆ టెండర్ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహిస్తామని అన్నారు. ఈ మేరకు దేవస్థానం ఈవో భవాని శంకర్కు వినతి పత్రం సమర్పించగా ఆయన దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు దేవపూజ అశోక్, మోతే నరసింహ మిట్ట వెంకటేష్, మోతే బాలు సర్దార్ మోతే విజయ్ , కంసాని స్వామి మోతే శంకర్,రేఖల రాజు తదితరులు పాల్గొన్నారు.

# తస్మాత్ జాగ్రత్త!

## ఓటీపీ షేరింగ్, దుష్ట ఏపీకే ఫైల్స్ మరియు 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై ప్రజా హెచ్చరిక

హైదరాబాద్, మార్చి 27 (పోలీస్ నిఘా) : దేశవ్యాప్తంగా పెరుగుతున్న సైబర్ మోసాల నేపథ్యంలో, ఓటీపీను పంచుకోవడం మరియు దుష్ట మొబైల్ అప్లికేషన్లు (ఏపీకే ఫైల్స్) ద్వారా దొంగిలించిన వ్యక్తిగత సమాచారాన్ని ఉపయోగించి "డిజిటల్ అరెస్ట్" వంటి తీవ్రమైన మోసాలు జరుగుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

**సైబర్ నేరగాళ్ల విధానం:**

ఈ రకమైన మోసాలు పలు దశల్లో జరుగుతాయి:

1.ఓటీపీ ద్వారా డేటా దొంగతనం:

మోసగాళ్లు బ్యాంక్, టెలికాం లేదా ప్రభుత్వ అధికారులుగా నటించి, బాధితులను ఓటీపీలను చెప్పేలా మోసం చేస్తారు.

ఓటీపీలను ఉపయోగించి వారు:

బ్యాంక్ ఖాతాలకు అనధికార ప్రవేశం పొందుతారు

ఇమెయిల్ మరియు ఇతర సేవలను హ్యాక్ చేస్తారు

**ఏపీకే ఫైల్స్ ఇన్స్టాలేషన్:**

SMS, WhatsApp లేదా ఇమెయిల్ ద్వారా పంపిన లింకుల ద్వారా నకిలీ యాప్లు ఇన్స్టాల్ చేయిస్తారు.


ఇవి ఇన్స్టాల్ చేసిన తర్వాత:

SMS (ఓటీపీలతో సహా) చదవగలవు

పాస్వర్డ్లు,పిన్‌లు దొంగిలిస్తాయి

వ్యక్తిగత డేటా (ఐడి ప్రూఫ్స్, కాంటాక్ట్స్, ఫోటోలు) సేకరిస్తాయి

మొబైల్ను రిమోట్గా నియంత్రిస్తాయి




3. ప్రొఫైలింగ్ మరియు లక్ష్యంగా ఎంచుకోవడం:

దొంగిలించిన సమాచారంతో బాధితుడి పూర్తి వివరాలను తయారు చేసి, మోసం మరింత నమ్మదగినట్లు చేస్తారు.

4. "డిజిటల్ అరెస్ట్" మోసం అమలు:

మోసగాళ్లు పోలీస్, సీబీఐ లేదా ఇతర అధికారులుగా నటించి బాధితులను సంప్రదిస్తారు.

వారు:

తప్పుడు కేసులు వేస్తారు (మనీ లాండరింగ్ మొదలైనవి)

నిజమైన వ్యక్తిగత వివరాలను చూపించి నమ్మకం కలిగిస్తారు

వీడియో కాల్ ద్వారా భయపెడతారు

వెంటనే అరెస్ట్ చేస్తామని బెదిరిస్తారు

5. ఆర్థిక దోపిడీ:

భయం కలిగించి బాధితులను డబ్బు ట్రాన్స్ఫర్ చేయమని బలవంతం చేస్తారు:

"వెరిఫికేషన్ ఫీజు"

"సెక్యూరిటీ డిపాజిట్"

"కేసు సెటిల్మెంట్"

కొన్ని సందర్భాల్లో నేరుగా బ్యాంక్ ఖాతా నుండి డబ్బు తీసుకుంటారు.

ప్రజలకు సూచనలు:

ఓటీపీ, పాస్వర్డ్లు ఎవరితోనూ పంచుకోవద్దు

తెలియని లింకుల ద్వారా ఏపీకే ఫైల్స్ ఇన్స్టాల్ చేయవద్దు

యాప్లను అధికారిక App Store నుంచే డౌన్లోడ్ చేయండి

అనుమానాస్పద కాల్స్ను జాగ్రత్తగా ఉండండి

పోలీసులు వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయరు లేదా డబ్బు అడగరు

భయపడకండి ? వెంటనే కాల్ కట్ చేయండి

ఫిర్యాదు విధానం:

సైబర్ మోసం జరిగితే వెంటనే ఫిర్యాదు చేయండి:

హెల్ప్లైన్: 1930

వెబ్సైట్: https://cybercrime.gov.in

# రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఎంపీ వద్దిరాజు భేటీ

**కొత్తగూడెం (భద్రాచలం రోడ్) రైల్వే స్టేషన్ చారిత్రక ప్రాముఖ్యత రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి**






ఖమ్మం, మార్చి 27 (పోలీస్ నిఘా) : తెలంగాణలోని కొత్తగూడెం (భద్రాచలం రోడ్) రైల్వే స్టేషన్ చారిత్రక ప్రాముఖ్యత, నిరంతర సేవలను దృష్టిలో పెట్టుకుని డివిజన్ ఏర్పాటు చేసి మరింత అభివృద్ధి పర్చాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ విజ్ఞప్తి చేసింది. ఈ రైల్వే స్టేషన్ మూలాలు 1932లో బ్రిటిష్ కాలం నాటివని, వేగంగా విస్తరిస్తున్న సింగరేణి బొగ్గు క్షేత్రాలకు సేవలు అందించడానికి గాను దీనిని "భద్రాచలం రోడ్"గా అభివృద్ధి చేశారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ కే.ఆర్.సురేష్ రెడ్డి,డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్రలు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు తెలిపారు.వారు పార్లమెంట్ ప్రాంగణంలో శుక్రవారం మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చారు.ఆ కాలం నాటి చారిత్రక పత్రాలు, అరుదైన ఛాయాచిత్రాలు, రైల్వే, మైనింగ్ కార్యకలాపాలతో సంబంధం ఉన్న ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ స్టేషన్ ఒక వ్యూహాత్మక బొగ్గు రవాణా కేంద్రంగా ఎలా రూపుదాల్చిందో ఇవి స్పష్టం చేస్తాయని రవిచంద్ర, సురేష్ రెడ్డిలు మంత్రికి వివరించారు. శతాబ్ద కాలంగా కొత్తగూడెం దేశానికి విద్యుత్ సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నదని వారు చెప్పారు. ఇది బ్రిటిష్ కాలంలో బొగ్గు వెలికితీత, రవాణాను సాధ్యం చేసిందని తెలిపారు. ఇది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు ప్రధాన కేంద్రంగా కొనసాగుతున్నదని, భారతీయ రైల్వేలో సరుకు రవాణా ఆదాయానికి కీలకమైనదని తన వినతిపత్రంలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. ఇంత గొప్ప వారసత్వం ఉన్నా కూడా భారతీయ రైల్వే చరిత్రలో కొత్తగూడెం స్టేషన్ తగిన గుర్తింపు లేని కీలకమైన ది మిగిలిపోయిందని వారు మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ రోజు కొత్తగూడెంలో అనేక ప్రధాన రైల్వే ప్రాజెక్టులు కేంద్రీకృతమవుతున్నాయని ఎంపీలు రవిచంద్ర, సురేష్ రెడ్డిలు మంత్రికి తెలిపారు. కొత్తగూడెం- కిరండల్,మల్కన్ గిరి-భద్రాచలం జునాగఢ్-మల్కన్‌గిరి- భద్రాచలం కారిడార్, ప్రతిపాదిత కొత్తగూడెం- సత్తుపల్లి-కొవ్వూరు మార్గాలు అని వినతి పత్రంలో ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు.

ఈ ప్రాంతం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే ఒక ప్రధాన రైల్వే కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నదని ఎంపీ రవిచంద్ర తెలిపారు. 2032లో కొత్తగూడెం రైల్వే స్టేషన్ 100 ఏళ్ల మైలురాయిని చేరుకోనున్న తరుణంలో, ఈ చారిత్రాత్మక స్టేషన్‌కు తగిన గుర్తింపు లభించాలనేది ప్రజల చిరకాల ఆకాంక్ష అని ఆయన మంత్రికి వివరించారు. కొత్తగూడెంలో రైల్వే డివిజన్ ఏర్పాటు కేవలం అభివృద్ధి డిమాండ్ మాత్రమే కాదని, 1932 నుండి దాని చారిత్రక సహకారం, బొగ్గు, ఖనిజ రవాణాలో ప్రాముఖ్యత కలిగి ఉన్నదని, జాతీయ రైల్వే కేంద్రంగా భవిష్యత్తులో పాత్ర పోషించనున్నదని ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు. ఇలాంటి చర్య కార్యాచరణ సామర్థ్యాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుందని, మౌలిక సదుపాయాల నిర్వహణను మరింత బలోపేతం చేస్తుందని, ముఖ్యంగా గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లోని లక్షలాది మందికి ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన వివరించారు.కొత్తగూడెంను రైల్వే డివిజన్ గా ప్రకటించి అభివృద్ధి పర్చేందుకు వీలైనంత తొందరగా సాధ్యాసాధ్యాల అధ్యయనాన్ని మొదలు పెట్టాల్సిందిగా కోరారు. వందేళ్ల మైలురాయి (1932-2032) దృష్ట్యా ఈ ప్రతిపాదనను పరిగణించాల్సిందిగా వినతిపత్రంలో పేర్కొన్నారు. కొత్తగూడెం దశాబ్దాలుగా దేశ ఇంధన అవసరాలకు తోడ్పడుతోందని, శతాబ్దకాలం పూర్తి చేసుకుంటున్న ఈ తరుణంలో, ఇది గుర్తింపు, పెట్టుబడులు, సంస్థాగత హోదాకు అర్హమైనదని ఎంపీలు వద్దిరాజు, సురేష్ రెడ్డిలు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు వివరించారు.

# పలుచోట్ల శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి





**నేలకొండపల్లి భక్త రామదాసు ధ్యాన మందిరంలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవానికి హాజరై, పలుచోట్ల అన్నదానం కార్యక్రమాలు ప్రారంభించిన రామ సహాయం**

**పాల్గొన్న మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, తదితర నాయకులు**

ఖమ్మం/నేలకొండపల్లి, మార్చి 27 (పోలీస్ నిఘా) : శ్రీరామనవమి సందర్భంగా ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి జిల్లాలో పలు ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో పాల్గొని భక్తులతో కలిసి పూజలు నిర్వహించారు.

**ఖమ్మం నగరంలో..**: శ్రీనగర్ కాలనీ 7, 18 డివిజన్లలో, సాయి గణేష్ నగర్‌లలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డితో కలిసి హాజరై పూజల్లో పాల్గొన్నారు. నేలకొండపల్లిలోని ప్రసిద్ధ భక్త రామదాసు ధ్యాన మందిరంలో.. జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని సీతారాములకు మంగళ హారతులు సమర్పించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమాన్ని నిర్వహించగా, ఎంపీ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు స్వయంగా ప్రసాదాన్ని అందజేశారు. పిల్లలు, మహిళలు, వృద్ధులతో మమేకమై వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. నేలకొండపల్లి మండలం కొత్త కొత్తూరు, నాచేపల్లి, మంగాపురం గ్రామాల్లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని, అన్నదానాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..: భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఇటువంటి పండుగలు సమాజంలో ఐక్యత, భక్తి భావాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

**రెండు కుటుంబాలకు ఎంపీ పరామర్శ:**

నేలకొండపల్లి మాజీ సర్పంచ్ వంగవీటి నాగేశ్వరరావుకు ఇటీవల మోకాలి ఆపరేషన్ జరగగా.. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం వివరాలు తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే.. కాంగ్రెస్ సీనియర్ నాయకులు వాకా శ్రీనాథ్ తండ్రి వాకా రంగయ్య ఇటీవల మరణించగా.. ఎంపీ వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఈ కార్యక్రమాల్లో...: ఎదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిన అనిత, కార్పొరేటర్ నీరజ, కౌన్సిలర్ వెంకటరెడ్డి, మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు కొడాలి గోవిందరావు, కొప్పుల చంద్రశేఖర్, నెల్లూరి భద్రయ్య, మామిడి వెంకన్న, బొడ్డు బొందయ్య, టీపీసి సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, రంజిత్ నాయక్ పాల్గొన్నారు.




## మొటిమలు, గడ్డలు, అజీర్తికి చెక్ పెట్టే

# 5 అద్భుతమైన ఆకులు!



ప్రస్తుత కాలంలో కాలుష్యం, మారిన ఆహారపు అలవాట్ల వల్ల చర్మ సమస్యలు, జీర్ణ సంబంధిత ఇబ్బందులు సర్వసాధారణం అయ్యాయి. వీటికి ఖరీదైన మందులు వాడటమే కాకుండా, మన వంటింట్లో లేదా పెరట్లో దొరికే కొన్ని పచ్చని ఆకులతో శాశ్వత పరిష్కారం పొందవచ్చు. అవేంటో ఇప్పుడు చూద్దాం:

1. వేప ఆకులు: వేపను 'సర్వరోగ నివారిణి' అని పిలుస్తారు. ఇందులో యాంటీ-ఫంగల్, యాంటీ-బ్యాక్టీరియల్ గుణాలు మెండుగా ఉంటాయి. వేప ఆకులను పేస్ట్‌లా చేసి మొటిమలపై రాస్తే అవి త్వరగా తగ్గిపోతాయి. చర్మంపై వచ్చే వేడి గడ్డలు, ఇన్ఫెక్షన్లను తగ్గించడంలో వేప అద్భుతంగా పనిచేస్తుంది.


2. తులసి ఆకులు: తులసి కేవలం పవిత్రమైన మొక్క మాత్రమే కాదు, గొప్ప ఔషధం కూడా. ఇది రక్తాన్ని శుద్ధి చేయడంలో సహాయపడుతుంది. తులసి రసాన్ని ముఖానికి రాయడం వల్ల చర్మంపై ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. మొటిమల మచ్చలు కూడా తగ్గుతాయి.

3. పుదీనా: పుదీనా చర్మానికి చల్లదనాన్ని ఇస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. భోజనం తర్వాత పుదీనా ఆకులను నమలడం లేదా పుదీనా టీ తాగడం వల్ల గ్యాస్, కడుపు ఉబ్బరం తగ్గుతాయి. ఇది చర్మంలోని అదనపు నూనెను తొలగించి మొటిమలు రాకుండా చూస్తుంది.

4. కరివేపాకు: కరివేపాకును కేవలం పోపు కోసమే కాకుండా ఆరోగ్య కోసమూ వాడాలి. ఉదయాన్నే పరగడుపున కరివేపాకులను నమలడం వల్ల జీర్ణక్రియ వేగవంతమై బరువు తగ్గడానికి తోడ్పడుతుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాలను రక్షిస్తాయి.

5. కొత్తిమీర : కొత్తిమీరలో విటమిన్ సి, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడంలో కీలక పాత్ర పోషిస్తుంది. తద్వారా రక్తం శుద్ధి జరిగి చర్మం కాంతివంతంగా మారుతుంది. ఈ ఆకులను రెగ్యులర్‌గా ఆహారంలో భాగం చేసుకోవడం లేదా ప్యాక్స్‌గా వాడటం ద్వారా మీ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. అయితే, ఏదైనా కొత్త చిట్కా పాటించే ముందు చర్మంపై ప్యాచ్ టెస్ట్ చేయడం లేదా నిపుణుల సలహా తీసుకోవడం ఉత్తమం.

# పంటి నొప్పి పీడిస్తోందా..



ఓ మనిషి పూర్తి ఆరోగ్యంగా ఉండాలంటే అతని శరీరంలో ఉన్న అన్ని అవయవాలు సక్రమంగా పనిచేయాలి. వాటిలో ఏది ఒక్కటి సరిగ్గా పనిచేయకపోయినా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుంది. మన తినే ఆహారాన్ని మెత్తగా చేసి కడుపులోకి పంపండంలో మన దంతాలు ఎంతో కీలకంగా పనిచేస్తాయి. కానీ ప్రస్తుతం చాలా మంది ఈ దంత సమస్యలతో బాధపడుతున్నారు. ప్రపంచంలో అత్యధికంగా ప్రజలను వేధిస్తున్న ఆరోగ్య సమస్యల్లో ఈ సమస్యలు మొదటి స్థానం ఉంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 3.7 బిలియన్ల మంది దంత సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. చాలామంది పంటి నొప్పి లేదా చిగుళ్ల వాపు వచ్చినప్పుడే డాక్టర్ దగ్గరకు వెళ్తుంటారు. కానీ, దంత సమస్యలు రాకముందే నివారించడం లేదా ప్రారంభ దశలోనే గుర్తించి వాటికి చికిత్స తీసుకోవడం ఉత్తమని వైద్యులు సూచిస్తున్నారు. అయితే మీ దంతాలు ఆరోగ్యంగా ఉండాలి అంటే ఈ నాలుగు సూత్రాలు పాటిస్తే సరిపోతుంది అని నిపుణులు అంటున్నారు. దంతాలను, చిగుళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఖరీదైన చికిత్సల కంటే, రోజువారీ అలవాట్లలో చిన్న మార్పులు చేస్తే సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు చూద్దాం.

**దంతాలు ఆరోగ్యంగా ఉండాలంటే పాలించాల్సింది ఇవే**

రోజు బ్రష్ చేయడం: రోజుకు రెండుసార్లు కచ్చితంగా బ్రష్ చేయాలి.

ఆహారపు అలవాట్లు : చక్కెర ఎక్కువగా ఉండే పానీయాలు, స్నాక్స్‌ను తగ్గించాలి. ఇవి పళ్లపై బ్యాక్టీరియా పెరగడానికి కారణమవుతాయి.

దురలవాట్లకు దూరం: పొగాకు మరియు మద్యం సేవించడం వల్ల దంతాలు, చిగుళ్లే కాకుండా, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వీటిని పూర్తిగా వదిలేయడమే మేలు.

పౌష్టికాహారం: పండ్లు మరియు తాజా కూరగాయలను ఎక్కువగా తీసుకోవడం వల్ల దంతాలకు అవసరమైన పోషకాలు అందుతాయి.

**నిపుణుల సలహా**

నోరు ఆరోగ్యంగా ఉంటేనే.. శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. మీ దంత సంరక్షణను నిర్లక్ష్యం చేయకండి. చిన్న లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా భవిష్యత్తులో వచ్చే పెద్ద అనారోగ్య సమస్యలను అరికట్టవచ్చు అని నిపుణులు సూచిస్తున్నారు.

# మామిడి కాయలతో ఆరోగ్య ప్రయోజనాలు



వేసవి సీజన్ రాగానే మామిడి ప్రియుల ఆనందానికి హద్దులు ఉండవు. వేసవి ప్రారంభం కాగానే పచ్చి మామిడికాయలు మార్కెట్‌లో కనిపించడం మొదలవుతుంది. మామిడిని "పండ్ల రాజు"గా పిలుస్తారు. అందుకే దాని కోసం ఏడాది పొడవునా ఎదురుచూస్తారు. ముఖ్యంగా ఏప్రిల్‌లో పచ్చి మామిడికాయలు విరివిగా లభిస్తాయి. అయితే, పచ్చి మామిడి రుచి మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. ప్రతి కాలానికి అనుగుణంగా లభించే ఆహారాలను తినడం మన శరీరానికి చాలా అవసరం. అయితే, ఏ ఆహారమైనా పరిమితంగా తీసుకోవడం మంచిది. పచ్చి మామిడి పోషక విలువలు పచ్చి మామిడికాయలు విటమిన్ ం, విటమిన్ అ, విటమిన్ ఇ, కాల్షియం, ఐరన్, ఫైబర్, మెగ్నీషియం, ఫాస్ఫరస్ వంటి అనేక పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి శరీరాన్ని వేసవి వేడికి నుంచి రక్షించి, రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

ముఖ్యమైన ప్రయోజనాలు.. 1. నిర్జలీకరణం నివారణ.. పచ్చి మామిడి శరీరంలో నీటి లోటును పూడ్చడంలో సహాయపడుతుంది. వడదెబ్బ నుంచి రక్షించి, శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. అలాగే ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుతుంది.

2. జీర్ణక్రియ మెరుగుదల.. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం, గ్యాస్, అజీర్ణం, ఎసిడిటీ వంటి సమస్యలను తగ్గిస్తుంది.

3. రోగనిరోధక శక్తి పెంపు.. విటమిన్ అ సమృద్ధిగా ఉండడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. వేసవిలో వచ్చే వ్యాధులను దూరం చేస్తుంది.

4. బరువు నియంత్రణ.. పండిన మామిడితో పోలిస్తే పచ్చి మామిడిలో చక్కెర, కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది మెటాబాలిజాన్ని పెంచి బరువు తగ్గడంలో సహాయపడుతుంది.

5. కాలేయం, దంతాల ఆరోగ్యం.. కాలేయాన్ని శుభ్రపరచడంలో సహాయపడుతుంది. అలాగే చిగుళ్ల నుంచి రక్తస్రావం, నోటి దుర్వాసన వంటి సమస్యలను తగ్గిస్తుంది. జాగ్రత్తలు: పచ్చి మామిడికాయలు ఆరోగ్యానికి మంచివే అయినప్పటికీ, వాటిని పరిమితంగా మాత్రమే తినాలి. ఎక్కువగా తింటే కడుపు నొప్పి, గొంతు నొప్పి వంటి సమస్యలు రావచ్చు. నెయ్యి లేదా కొద్దిగా ఉప్పుతో తీసుకుంటే మరింత ప్రయోజనం ఉంటుంది. మొత్తంగా, పచ్చి మామిడి వేసవిలో శరీరానికి సహజమైన శక్తిని అందించే ఒక అద్భుతమైన ఆహారం.

# పునర్జన్మ ప్రసాదించే ప్రాణదాతలు

అడవి ప్రాంతాల్లో ఆశాకిరణం
ఒక్క కాల్‌తో ప్రాణ రక్షణ
గణాంకాల్లో సేవల ప్రతిభ
గోల్డెన్ అవర్‌లో ప్రాణ రక్షణ
మృత్యువుతో పోరాడే సైనికులు
ప్రాణాలకు భరోసా






ములుగు, మార్చి 27 (పోలీస్ నిఘా) : ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కంటికి రెప్పలా కాపాడుతూ, సమయానికి ఆస్పత్రికి చేర్చి పునర్జన్మ ప్రసాదిస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది సేవలు ములుగు జిల్లాలో ప్రశంసలు అందుకుంటున్నాయి. గిరిజన ప్రాంతమైన ఈ జిల్లాలో 108 సేవలు ప్రజలకు ప్రాణాధారంగా మారాయి.

**అడవి ప్రాంతాల్లో ఆశాకిరణం**

దట్టమైన అడవులు, దూర గ్రామాలతో కూడిన ములుగు జిల్లాలో అత్యవసర వైద్య సేవలు అందించడం కష్టసాధ్యమైనప్పటికీ, 108 అంబులెన్స్ సిబ్బంది వేగంగా స్పందిస్తూ గిరిజన ప్రజలకు అండగా నిలుస్తున్నారు. వంద ఫోన్లు చేసినా రాని బంధువుల కంటే ఒక్క కాల్‌తో స్పందించే 108 సిబ్బందే నిజమైన ఆపద్బాంధవులని ప్రజలు అంటున్నారు.

**ఒక్క కాల్‌తో ప్రాణ రక్షణ**

ఇటీవల ఓ గిరిజన గూడెంలో అర్ధరాత్రి సమయంలో గర్భిణీ స్త్రీ పురిటినొప్పులతో బాధపడుతుండగా, కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందిం చారు. వెంటనే అక్కడికి చేరుకున్న సిబ్బంది మార్గమధ్యంలోనే ప్రసవం నిర్వహించి తల్లిబిడ్డలను సురక్షితంగా ఆస్పత్రికి తరలించారు. జిల్లాలో ఇలాంటి సంఘ టనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి.

**గణాంకాల్లో సేవల ప్రతిభ**

2025 మార్చి నుండి 2026 ఫిబ్రవరి వరకు ములుగు జిల్లాలో 108 సేవలు మొత్తం 18,886 అత్యవసర కాల్స్‌కు స్పందించాయి. రోడ్డు ప్రమాదాలు 1569, గర్భిణీ కేసులు 2461, స్పృహ కోల్పోయిన వారు 827, కడుపు నొప్పి 2437, శ్వాసకోశ సమస్యలు 1251, గుండెపోటు కేసులు 932, పాయిజన్ కేసులు 863, మూర్ఛ (ఫిట్స్) 647, ఆత్మహత్య ప్రయత్నాలు 368, ఇతర కేసులు 5816 నమోదయ్యాయి.

**గోల్డెన్ అవర్‌లో ప్రాణరక్షణ**

ప్రాణాపాయ పరిస్థితుల్లో మొదటి గంట అత్యంత కీలకమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ సమయంలో 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్ (ఈఎంటి) తక్షణ చికిత్స అందిస్తుండగా, అంబులెన్స్ పైలట్లు వేగంగా రోగులను ఆస్పత్రులకు తరలిస్తున్నారు.

**మృత్యువుతో పోరాడే సైనికులు**


పండుగలు, సెలవులు లేకుండా నిరంతరం సేవలందిస్తున్న 108 సిబ్బంది నిజంగా మృత్యువుతో పోరాడే సైనికులని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదాలు, అనారోగ్య పరిస్థితుల్లో క్షణాల్లో స్పందించడం వారి ప్రత్యేకత. మానవత్వానికి నిదర్శనం . గర్భిణీ స్త్రీలకు అంబులెన్స్‌లోనే ప్రసవాలు నిర్వహించడం, ప్రమాద బాధితులను ఆదుకోవడం, రోగులకు ధైర్యం చెప్పడం వంటి సేవలతో 108 సిబ్బంది మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు.

**ప్రాణాలకు భరోసా..**

మొత్తానికి ములుగు జిల్లాలో 108 అంబులెన్స్ సేవలు కేవలం వైద్య సేవలే కాకుండా ప్రజల ప్రాణాలకు భరోసాగా మారాయి. ఒక్క ఫోన్ కాల్‌తో పునర్జన్మ ప్రసాదిస్తున్న ఈ ప్రాణదాతలు సమాజానికి నిజమైన హీరోలుగా నిలుస్తున్నారు.



108 ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్



ములుగు జిల్లా మేనేజర్..

## చిట్కుల్ జిటిఎన్ కాలనీలో అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం మహోత్సవాన్ని నిర్వహించిన నీలం మధు






పటాన్ చెరు, మార్చి 27 (పోలీస్ నిఘా) : సంగారెడ్డిజిల్లా,పటాన్ చెరు నియోజకవర్గంలోని ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ జిటిఎన్ కాలనీలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు భక్తి పారవశ్యాన్ని నింపాయి. నీలం మధు ముదిరాజ్ సొంత నిధులతో నిర్మించిన ఆలయంలో గత ఐదు రోజులుగా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహించారు. జలాధివాసం, ధాన్యాధివాసం వంటి క్రతువులతో పాటు లోకకళ్యాణం కోసం హోమాలు, యజ్ఞయాగాలు నిర్వహించగా, చిట్కుల్ గ్రామం అంతా ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. అనంతరం స్వామివారి విగ్రహాలకు మహా కుంభాభిషేకం నిర్వహించి, ఆలయాన్ని భక్తుల దర్శనార్థం సిద్ధం చేశారు. శ్రీరామనవమి రోజున అభిజిత్ లగ్నంలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. నీలం మధు ముదిరాజ్ దంపతులు తమ స్వగృహం నుండి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పించి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ముత్యాల తలంబ్రాలతో అలంకరించిన సీతారాముల కళ్యాణ ఘట్టం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి భక్తజనసంద్రం భారీగా హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరిలో గాయని భవాని ఆధ్వర్యంలో గాయకులు ఆలపించిన భక్తి గీతాలు ప్రేక్షకులను అలరించాయి. ఆలయ ప్రాంగణం అంతా "జై శ్రీరామ్" నినాదాలతో మార్మోగింది. భక్తి గీతాల మధ్య మహిళలతో కలిసి నీలం మధు ముదిరాజ్ దంపతులు కోలాటం ఆడి ఉత్సవాలకు మరింత ఉత్సాహం తెచ్చారు. ఆలయ నిర్మాణం పూర్తి కావడం, సీతారాముల ప్రతిష్టాపన జరగడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, శాంతిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ మహోత్సవాలకు విచ్చేసిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# గడ్డి మందుపై పూర్తి నిషేధం విధించాలి

గడ్డి మందు పర్యావరణం, ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరం
ఆత్మహత్యలకు ఆయుధంగా మారిన పారాక్వాట్ .....
నిషేధమే దీనికి పరిష్కారం
పారాక్వాట్‌తో రైతులు, ప్రజల ప్రాణాలకు ముప్పు
ప్రాణాంతక గడ్డి మందుపై కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలి
లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య డిమాండ్



వరంగల్, మార్చి 27 (పోలీస్ నిఘా) : దేశవ్యాప్తంగా తీవ్ర ఆరోగ్య, పర్యావరణ ప్రమాదాలకు కారణమవుతున్న పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు) అనే అత్యంత ప్రమాదకర హెర్బిసైడ్‌పై తక్షణమే పూర్తి నిషేధం విధించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని లోక్‌సభలో డిమాండ్ చేశారు. శుక్రవారం పార్లమెంట్ జీరో అవర్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు) వినియోగం వల్ల నేల, నీరు, ఇసుక తీవ్రంగా కాలుష్యం అవుతున్నాయని, దీని ప్రభావం వ్యవసాయ వ్యవస్థలపై తీవ్రమవుతోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. ఇది కేవలం పర్యావరణానికే కాకుండా ప్రజల ఆరోగ్యానికి కూడా ప్రాణాంతక ముప్పుగా మారిందని హెచ్చరించారు. అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే, ఈ రసాయనం గ్రామీణ ప్రాంతాల్లో ఆత్మహత్యలకు "మరణాయుధం"గా మారిందని ఎంపీ పేర్కొన్నారు. పారాక్వాట్ సేవించిన సందర్భాల్లో దాదాపు 100 శాతం మరణాలు సంభవిస్తున్నాయని, దీనికి ఇప్పటివరకు సమర్థవంతమైన యాంటిడోట్ లేకపోవడం పరిస్థితిని మరింత విషమం చేస్తోందని అన్నారు. తెలంగాణలోని వరంగల్ సహా పలు జిల్లాల్లో ఇది ఆత్మహత్యలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రమాదకర సాధనంగా మారిందని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, పర్యావరణం, సామాన్య ప్రజల ప్రాణాలను కాపాడేందుకు పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు) తయారీ, విక్రయం, వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించాలని ఎంపీ కేంద్రాన్ని కోరారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఎఓం) తెలంగాణ సహా పలువురు వైద్య నిపుణులు, ప్రజాప్రతినిధులు కూడా ఇదే అంశంపై ఇప్పటికే హెచ్చరికలు జారీ చేస్తూ నిషేధం కోసం ఒత్తిడి తెస్తున్నారని ఎంపీ గుర్తుచేశారు. ప్రమాదకర రసాయనాలకు బదులుగా సురక్షిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ డా.కడియం కావ్య కోరారు.

## మత భేదాలకు అతీతంగా
# శ్రీరామనవమి వేడుకలు
### సీతారాముల వారి కళ్యాణంలో పాల్గొన్న మైనార్టీ నాయకులు



చేవెళ్ల, మార్చి 27 (పోలీస్ నిఘా) : మత భేదాలు లేకుండా పండుగలను కలిసి జరుపుకోవడం సమాజ ఐక్యతకు దోహదమని మహమ్మద్ జాహేద్ అన్నారు. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు ఇబ్రహీంపల్లి లో సీతారాముల వారి కల్యాణోత్సవాన్ని గ్రామ పెద్దలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపల్లి మాజీ ఉపసర్పంచ్, చేవెళ్ల మండల బిఆర్ఎస్ మైనార్టీ సెల్ నాయకులు, మహమ్మద్ జాహేద్ తో పాటు సలీం, దాతర్, ఖాలేద్, హమేద్, మునవ్వర్ లు కౌన్సిలర్ మధుసూదన్ రెడ్డి తో కలిసి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులు కూడా కళ్యాణోత్సవంలో పాల్గొని మతసామరస్యానికి నిదర్శనంగా నిలిచారు. భక్తులతో కలిసి కళ్యాణాన్ని వీక్షించి పూలమాలలు, పండ్లు సమర్పించడంతో పాటు కళ్యాణ కానుకలు సమర్పిస్తూ తమ భక్తి శ్రద్ధలు చాటుకున్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ జాహేద్ మాట్లాడుతూ... మత భేదాలు లేకుండా పండుగలను జరుపుకోవడం సమాజానికి ఎంతో మంచిదని పేర్కొన్నారు. ఆలయ నిర్వాహకులు ముస్లిం సోదరులను సాదరంగా ఆహ్వానించి అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు సౌభ్రాతృత్వానికి ప్రతీకలని పలువురు అభిప్రాయపడ్డారు. గ్రామంలో శాంతి, ఐక్యత కొనసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు ఎన్ను జంగారెడ్డి, దశరథ్, గ్రామస్తులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## కొండపైన వైభవంగా సీతారాముల కళ్యాణం





యాదగిరిగుట్ట, మార్చి 27 (పోలీస్ నిఘా) : ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన పర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయం (శివాలయం) నందు సీతారామచంద్ర స్వామి వారి వసంత నవరాత్రోత్సవములలో భాగంగా శివాలయం ప్రధానార్చకులు నరసింహ రామ శర్మ,ఆధ్వర్యంలో,పునర్వసు నక్షత్రంలో అభిజిత్ ముహూర్తంలో సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహింపబడింది. ఈ సందర్భంగా ఆలయ ఈవో భవాని శంకర్,చైర్మన్ నరసింహమూర్తి స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామివారి కళ్యాణ ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ అధికారులు కళ్యాణానికి ఎలాంటి ఆటంకం లేకుండా భక్తులకు సౌకర్యాలను,చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. శాస్త్రోక్తంగా నిర్వహింపబడిన సీతారాముల కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించి స్వామివారి ఆశీస్సులను పొందారు. ఈ కార్యక్రమంలో ప్రధాన పురోహితులు నాగరాజు శర్మ, శివాలయం అర్చకులు, నరసింహమూర్తి,సాయికృష్ణ, శ్రీనివాస శర్మ,ఏఈఓ రఘు నవీన్ కుమార్ సూపరింటెండెంట్,సురేందర్ రెడ్డి, ఎస్పీఎఫ్ సిఐ శేషగిరిరావు,ఏఎస్ఐ మాణిక్ ప్రభు,ఈవో సిసి నగేష్, తదితరులు ఉన్నారు.

## ఔరుపల్లి గ్రామ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రంగారెడ్డి, మార్చి 27 (పోలీస్ నిఘా) : మాడ్గుల్ మండలం ఔరుపల్లి గ్రామం సమీపంలోని ఎండిపోయిన కాలువలో సుమారు 50 ఏళ్ల వ్యక్తి మృతదేహం గుర్తించారు. మృతదేహం కుళ్లిపోయి ఉండటంతో, కొన్ని రోజుల క్రితమే మరణించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు మాడ్గుల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్హెచ్ఓ వేణుగోపాల్ తెలిపారు.

# చిత్రం

# ఇండియన్ టాప్ డైరెక్టర్స్ వీళ్లే!




ఒకప్పుడు కేవలం హీరోల ఇమేజ్పైనే సినిమాలు ఆడేవి. కానీ ఇప్పుడు బ్రాండ్ డైరెక్టర్ల హవా నడుస్తోంది. బాక్సాఫీస్ వద్ద అపజయం అంటే ఎరుగని కొందరు ధీర దర్శకులు తమదైన ముద్రతో ఇండియన్ సినిమా రికార్డులను తిరగరా స్తున్నారు. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకూ కొంత మంది దర్శకులు తీసిన ప్రతి సినిమా బ్లాక్ బస్టర్ కావడం ఓ అరుదైన రికార్డుగా చెప్పొచ్చు.. ఈ జాబితాలో అగ్రస్థానంలో ఎస్.ఎస్. రాజమౌళి ఉన్నారు. స్టూడెంట్ నంబర్ 1 నుండి మొన్నటి ' ఆర్ ఆర్ ఆర్ ' వరకు కెరీర్లో అపజయమే లేదు. తెలుగు సినిమాను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ఘనత ఆయనది. అదే విధంగా బాలీవుడ్లో రాజ్ కుమార్ హిరాణీ సోషల్ మెసేజ్ను కామెడీతో కలిపి అందిస్తూ వందశాతం సక్సెస్ రేట్తో దూసుకుపోతున్నారు. వీరిద్దరూ భారతీయ సినిమాకు రెండు కళ్ళ వంటి వారు. సౌత్ ఇండియా నుండి సంచలనాలు సృష్టిస్తోన్న దర్శకుల్లో ప్రశాంత్ నీల్, లోకేష్ కనగరాజ్, సందీప్ రెడ్డి వంగా ప్రధానంగా కనిపిస్తారు. కేజీఎఫ్ ' తో కన్నడ సినిమా సత్తా చాటిన ప్రశాంత్ నీల్, 'ఖైదీ విక్రమ్, లియో'తో తనకంటూ ఒక సినిమాటిక్ యూనివర్స్ను సృష్టించుకున్న లోకేష్, 'అర్జున్ రెడ్డి , 'యానిమల్'అనే రా-రస్టిక్ సినిమాలతో ట్రెండ్ సెట్ చేసిన సందీప్ రెడ్డి వంగా. వీరంతా బాక్సాఫీస్ వద్ద పరాజయమే లేని ధురంధరులు. టెక్నికల్ వండర్స్ , విజువల్ గ్రాండియర్ విషయానికి వస్తే నాగ్ అశ్విన్ కల్కి 2898 ఏడీ, అయాన్ ముఖర్జీ బ్రహ్మాస్త్ర, ఆదిత్య ధర్ ఉరి, ధురందర్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తాయి. భారీ బడ్జెట్ సినిమాలను హ్యాండిల్ చేయడంలో వీరంతా స్పెషలిస్టులే. ప్రేక్షకులను మెప్పించడంలో వీరంతా వంద శాతం సక్సెస్ అయ్యారు. అలాగే మాస్ పల్స్ తెలిసిన అట్లీ – నెల్సన్ దిలీప్ కుమార్ వంటి దర్శకులు కమర్షియల్ సినిమాలతో బాక్సాఫీస్ను షేక్ చేస్తున్నారు. కథా బలంతో పాటు సామాజిక అంశాలను ఎంచుకుంటూనే హిట్లు కొడుతున్న మారీ సెల్వరాజ్ వంటి వారు ఒక వర్గం అయితే పక్కా కమర్షియల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్లతో వరుసగా ఏడు హిట్లు కొట్టిన అనిల్ రావిపూడి మరొక వర్గం. అనిల్ రావిపూడి ఫ్లాప్ లేని డైరెక్టర్ అనే ట్యాగ్ను ప్రతి సినిమాతో నిలబెట్టుకుం టున్నారు. ఇండస్ట్రీ ఏదైనా వీరంతా కేవలం హిట్లే కాదు. ఇండస్ట్రీ హిట్లు ఇస్తూ బాక్సాఫీస్ చక్రవర్తులుగా వెలిగిపోతున్నారు. ఈ దర్శకులతా తమ ప్రతిభతో హీరోల కంటే మిన్నగా ఫ్యాన్ బేస్ను సంపాదించుకుంటున్నారు. కథనంపై పట్టు, ప్రేక్షకు ల నాడిని పట్టుకోవడంలో వీరు నైపుణ్యం అసామాన్యమైంది. భవిష్యత్తులో భారతీయ సినిమా మరిన్ని అంతర్జాతీయ శిఖరాలను అధిరో హించడం ఖాయం. పరాజయం లేని ఈ ప్రయాణం ఇలాగే కొనసాగాలని సినీ ప్రియులు కోరుకుంటున్నారు.

# సిద్ధు లైనప్లోకి మరొకటా?




టాలీవుడ్ యంగ్ హీరో సిద్ధు జొన్నలగడ్డ ప్రస్తుతం తన అప్కమింగ్ ప్రాజెక్టుల విషయంలో సరైన ప్లాన్ తో ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు కమర్షియల్, రొమాంటిక్ కామెడీ కథలతో మంచి గుర్తింపు సంపాదించిన సిద్ధు? ఇకపై కాస్త భిన్నమైన స్టోరీలు ఎంపిక చేసుకోవాలనే టార్గెట్ తో ఉన్నారని టాక్ వినిపిస్తోంది. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించే విధంగా విభిన్నమైన కథాంశాలతో సినిమాలు చేయాలని ఆయన నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇప్పటికే సిద్ధు వరుసగా ఆసక్తికరమైన ప్రాజెక్టులను లైన్లో పెడుతున్నట్లు తెలుస్తోంది. రీసెంట్ గా ఆయన మూడు కొత్త ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. వాటిలో ఒక సినిమాను కొత్త దర్శకుడు అనిల్ కుమార్ తెరకెక్కించనున్నారని సమాచారం. ఆ సినిమా కాన్సెప్ట్ పూర్తిగా కొత్తగా ఉండబోతుందని, సిద్ధు ఇప్పటివరకు చేయని తరహాలో కనిపించనున్నారని టాక్. మరో ప్రాజెక్టును దర్శకుడు స్వరూప్తో కలిసి చేయబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఆ కాంబినేషన్ లో వచ్చే సినిమా కూడా వినూత్నంగా ఉండబోతుందని అంచనా. టాలీవుడ్ లో అత్యంత విజయవంతమైన దర్శకుల్లో ఒకరితో సిద్ధు మరో ప్రాజెక్ట్ చేయబోతున్నాడనే సమాచారం కూడా ఉంది. అయితే ఆ దర్శకుడు ఎవరు అన్నది తెలియదు. తాజాగా మరో ఆసక్తికరమైన అప్డేట్ కూడా వినిపిస్తోంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ ఓ వెబ్ సిరీస్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఆ సిరీస్ ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ అయిన నెట్ ఫ్లిక్స్ కోసం రూపొందనుందని సమాచారం. ఆ ప్రాజెక్ట్ ను సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై యంగ్ ప్రొడ్యూసర్ నాగవంశీ గ్రాండ్ గా నిర్మించనున్నారని వినికిడి. త్వరలోనే ఆ సిరీస్ షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. వెంకీ అట్లూరి ఇప్పటికే తన సినిమాలతో మంచి టాలెంట్ ఉన్న దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయనతో సిద్ధు చేయబోయే వెబ్ సిరీస్ పై మంచి అంచనాలు ఏర్పడుతున్నాయి. సినిమా మాత్రమే కాకుండా ఓటీటీ కంటెంట్ లో కూడా తన మార్క్ చూపించాలని సిద్ధు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా చూస్తే, సిద్ధు లైనప్ లో మొత్తం ఐదు ప్రాజెక్టులు ఉన్నట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుతం ఆయన సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై రూపొందుతున్న మరో సినిమాలో నటిస్తున్నారు. ఆ మూవీ షూటింగ్ శరవేగంగా కొనసాగుతున్నట్లు సమాచారం. ఆ చిత్రం పూర్తయిన తర్వాత ఆయన కొత్తగా లాక్ చేసిన ప్రాజెక్టుల్లో ఏదో ఒకటి ప్రారంభమయ్యే అవకాశముంది. ఏదేమైనా కమర్షియల్ హిట్లతో వచ్చిన ఇమేజ్ ను కాపాడుకుంటూనే.. కొత్త కథలతో తన కెరీర్ ను మరో స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో సిద్ధు ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది. మరి కొత్త ప్రాజెక్టులు ఆయనకు ఎలాంటి ఫలితాలు తీసుకొస్తాయో చూడాలి.

# రాకాస.. ఫుల్ ఎంటర్టైన్మెంట్ పక్కా!




మెగా ప్రిన్సెస్ నిహారిక కొణిదెల నిర్మాణంలో వస్తున్న క్రేజీ హారర్ కామెడీ థ్రిల్లర్ 'రాకాస' విడుదలకు సిద్ధమైంది. 'మ్యాడ్' ఫేమ్ సంగీత్ శోభన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని యు/ఏ సర్టిఫికేట్ను దక్కించుకుంది. విభిన్నమైన కథాంశంతో, భయం కలిగిస్తూనే కడుపుబ్బ నవ్వించేలా రూపొందిన ఈ చిత్రంపై ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఏప్రిల్ 3న థియేటర్లలో సందడి చేయనున్న ఈ సినిమా, వేసవి కానుకగా ప్రేక్షకులకు ఫుల్ ఎంటర్టైన్మెంట్ అందించడం ఖాయంగా కనిపిస్తోంది. నిహారిక కొణిదెల తన 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' బ్యానర్పై కంటెంట్ ఉన్న సినిమాలనే నిర్మిస్తారనే నమ్మకం ప్రేక్షకుల్లో ఉంది. దానికి తగ్గట్టుగానే 'రాకాస' సినిమా సెన్సార్ బోర్డు నుండి జ/o సర్టిఫికేట్ పొంది పాజిటివ్ వైబ్స్ను క్రియేట్ చేస్తోంది. సెన్సార్ సభ్యులు ఈ సినిమాలోని హారర్ ఎలిమెంట్స్ మరియు కామెడీ టైమింగ్ను మెచ్చుకున్నట్లు సమాచారం. కేవలం భయపెట్టడమే కాకుండా, కుటుంబం అంతా కలిసి చూసేలా వినోదాన్ని జోడించడంతో ఈ వేసవిలో చిన్న పిల్లల నుండి పెద్దల వరకు అందరినీ ఈ 'రాకాస' అలరించబోతోంది. ఈ సినిమా కథ ఒక చిన్న ఊరి నేపథ్యంలో సాగుతుంది. ఆ గ్రామాన్ని ఒక క్రూరమైన 'రాకాసి' పట్టి పీడిస్తూ ఉంటుంది. అసలు ఆ రాక్షసుడు ఎక్కడి నుండి వచ్చాడు? ఊరి ప్రజలనే ఎందుకు టార్గెట్ చేస్తున్నాడు? అనే పాయింట్స్ చాలా ఆసక్తికరంగా ఉండబోతున్నాయి. హీరో సంగీత్ శోభన్ తన ప్రేయసి (నయన్ సారిక) కోసం ఆ ఊరికి వచ్చి, అనుకోకుండా ఆ రాక్షసుడి ఉచ్చులో చిక్కుకుంటాడు. నిజ జీవితంలో చాలా పిరికివాడైన హీరో, ఆ రాక్షసుడిని ఎలా ఎదిరించాడు? తన ప్రేయసిని ఎలా కాపాడుకున్నాడు? అనేదే ఈ సినిమాలోని అసలు ట్విస్ట్. 'మ్యాడ్' సినిమాతో యువతలో మంచి క్రేజ్ సంపాదించుకున్న సంగీత్ శోభన్, ఈ సినిమాలో తనదైన కామెడీ టైమింగ్తో అదరగొట్టబోతున్నాడు. ఆయనకు తోడుగా సీనియర్ నటుడు బ్రహ్మాజీ మార్క్ హ్యూమర్ తోడవడంతో నవ్వులకు కొదవ ఉండదని తెలుస్తోంది. ట్రైలర్లో చూసిన విజువల్స్ మరియు బ్యాక్గ్రౌండ్ స్కోర్ సినిమాపై క్యూరియాసిటీని పెంచేస్తున్నాయి. భయపెడుతూనే నవ్వించడం అనేది కష్టమైన ప్రక్రియ అయినప్పటికీ, దర్శకురాలు మానస శర్మ ఈ చిత్రాన్ని చాలా బ్యాలెన్స్డ్గా మలిచినట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను ముగించుకుని విడుదల కానున్న 'రాకాస', సంగీత్ శోభన్ కెరీర్లో మరో మైలురాయిగా నిలుస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో వస్తున్న ఈ సినిమాను ఏప్రిల్ 3వ తేదీన గ్రాండ్గా రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ట్రైలర్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తుండటంతో, ఓపెనింగ్స్ పరంగా కూడా ఈ సినిమా సత్తా చాటే అవకాశం ఉంది. ఈ వేసవిలో ఒక డిఫరెంట్ హారర్ కామెడీని ఎక్స్పీరియన్స్ చేయాలనుకునే వారికి 'రాకాస' పర్ఫెక్ట్ ఛాయిస్!

## పూజకు త్రివిక్రమ్ మరో ఛాన్స్.. కానీ..



దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్– హీరోయిన్ పూజా హెగ్డే కాంబినేషన్ టాలీవుడ్ లో ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఆ కాంబోలో వచ్చిన సినిమాలు కేవలం కమర్షియల్ సక్సెస్ మాత్రమే కాకుండా, ఆడియన్స్ కు మంచి ఎంటర్టైన్మెంట్ కూడా అందించాయి. ఇప్పుడు మళ్లీ ఆ కాంబినేషన్ గురించి వార్తలు రావడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. త్రివిక్రమ్ దర్శకత్వంలో పూజా హెగ్డే మొదటిసారి నటించిన చిత్రం అరవింద సమేత వీర రాఘవ. ఆ సినిమాలో ఆమె పాత్రకు మంచి రెస్పాన్స్ లభించింది. ఆ తర్వాత వీరిద్దరి కాంబినేషన్ లో వచ్చిన అల వైకుంఠపురంలో భారీ విజయాన్ని సాధించింది. ఆ మూవీ బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడంతో పాటు, పూజకు స్టార్ హీరోయిన్ గా మరింత క్రేజ్ తెచ్చిపెట్టింది. ఆమె గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆ రెండు విజయాలతో త్రివిక్రమ్– పూజా కాంబినేషన్ పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అయితే తర్వాత కొన్ని ప్రాజెక్టుల్లో మార్పులు చోటుచేసుకోవడంతో మళ్లీ కలిసి పని చేసే అవకాశం రాలేదు. గుంటూరు కారం సినిమాలో మొదట పూజనే హీరోయిన్ గా ఎంపికైనప్పటికీ, తర్వాత ఆమె ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడం చర్చనీయాంశమైంది. అలా ఛాన్సులు రాకపోవడంతో పూజా టాలీవుడ్లో కొంత గ్యాప్ తీసుకున్నట్లు కనిపించింది. ఈ నేపథ్యంలో మళ్లీ త్రివిక్రమ్ సినిమాతో ఆమె పేరు వినిపించడం విశేషంగా మారింది. ప్రస్తుతం త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న'ఆదర్శ కుటుంబం చిత్రంలో హీరోగా వెంకటేష్ నటిస్తున్నారు. హీరోయిన్ గా శ్రీనిధి శెట్టి యాక్ట్ చేస్తున్నారు. ఇప్పుడు పూజను త్రివిక్రమ్ రంగంలోకి దింపనున్నారని వినికిడి. అయితే సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్ గా కాకుండా స్పెషల్ సాంగ్ లో కనిపించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇదే నిజమైతే, ఇది త్రివిక్రమ్– పూజా కాంబినేషన్ లో కొత్త యాంగిల్ గా చెప్పుకోవచ్చు. గతంలో పూజా చేసిన స్పెషల్ సాంగ్స్ కు మంచి రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. రంగస్థలంలో చేసిన జిగేల్ రాణి పాట ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చింది. ఎఫ్ 3లో చేసిన మాస్ సాంగ్ కూడా ప్రేక్షకులను అలరించింది. త్రివిక్రమ్ కూడా తన సినిమాల్లో కొందరు హీరోయిన్లను రిపీట్ చేయడం కొత్త విషయం కాదు. గతంలో ఇలియానా, సమంత రూత్ ప్రభుతో పలుమార్లు పని చేశారు. అదే తరహాలో పూజాను కూడా మళ్లీ తన సినిమాలో భాగం చేయాలని చూస్తున్నారని చర్చ జరుగుతోంది. ఇక ఆదర్శ కుటుంబం షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. త్వరలోనే ఆ ప్రాజెక్ట్ కు సంబంధించి అఫీషియల్ అప్డేట్స్ వచ్చే అవకాశముంది. మరి పూజ నిజంగా ఆ సినిమాలో భాగమవుతుందా? లేదా? అన్న విషయంపై క్లారిటీ రావాల్సి ఉంది.

# తోపుడు బండ్ల వ్యాపారుల నుండి అక్రమ వసూళ్లు పర్వం

హైదరాబాద్, మార్చి 27 (పోలీస్ నిఘా) : చార్మినార్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పర్యవేక్షణలో, చార్మినార్ పోలీసులు తోపుడు బండ్ల వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న ఒక అక్రమ వసూళ్ల ముఠాను ఛేదించారు. ఈ ముఠాలో పరారీలో ఉన్న నిందితుడిని పోలీసులు విజయవంతంగా అరెస్ట్ చేశారు.

కేసు వివరాలు: చార్మినార్ ప్రాంతంలో కాస్మెటిక్ తోపుడు బండి నడుపుతున్న ఒక వ్యాపారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. నిందితులు తనను బెదిరిస్తూ, వ్యాపారం కొనసాగించాలంటే ప్రతిరోజూ "మామూళ్లు" చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై చార్మినార్ పోలీసులు క్రైమ్ నం. 49/2026, సెక్షన్ 308(5), 351(3), 127(2) ఆర్/డబ్ల్యు 3(5) బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేశారు.

నిందితుని వివరాలు: అజార్ ఖాన్ (44)

## ఒక నిందితుడి అరెస్ట్

(ఏ-3): తండ్రి: సర్వర్ ఖాన్, వృత్తి: షేక్ నశీర్ ఉద్దీన్ కు చెందిన చెరుకు రసం బండిలో పనివాడు, నివాసం: చంద్ర నగర్, యాకుత్ పురా, హైదరాబాద్.

నేర విధానం: నిందితుడు అజార్ ఖాన్ (ఏ-3) ను 24-03-2026న చార్మినార్ వద్ద అరెస్ట్ చేశారు. విచారణలో అతను తన సహచరులైన షేక్ నశీర్ ఉద్దీన్ ఏ గన్నా నశీర్ (ఏ-1) మరియు మొహమ్మద్ అజాన్ ఖాద్రీ ఏ తౌఫీక్ (ఏ-2) లతో కలిసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు అంగీకరించాడు.

వీరు మొదట రోజుకు రూ.500 వసూలు చేసేవారు, ఆ తర్వాత దానిని రూ.1000 కు పెంచారు. పెంచిన మొత్తాన్ని చెల్లించని వ్యాపారులను కత్తులతో బెదిరించడమే కాకుండా, వ్యాపార ప్రదేశం ఖాళీ చేయాలని హెచ్చరిస్తూ



తీవ్ర పర్యవసానాలు ఉంటాయని భయపెట్టేవారు.

నిందితుల నేర చరిత్ర: ప్రధాన నిందితుడు (ఏ-1) షేక్ నశీర్ ఉద్దీన్ ఏ గన్నా నశీర్ భవానీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక రౌడీ షీటర్. ఇతనిపై గతంలో ఎన్.డి.పి.ఎస్ యాక్ట్, ఆర్మ్స్ యాక్ట్, జూదం, వసూళ్లు మరియు హత్యాయత్నం వంటి అనేక తీవ్రమైన నేరారోపణలు ఉన్నాయి. మరో నిందితుడు (ఏ-2) మొహమ్మద్ అజాన్ ఖాద్రీ గతంలోనే అరెస్టయి రిమాండ్లో ఉన్నాడు.

పోలీసుల విజ్ఞప్తి: చార్మినార్ పరిసరాల్లోని చిన్న వ్యాపారులు మరియు తోపుడు బండ్ల వారు ఇలాంటి అక్రమ వసూళ్లకు భయపడవద్దని పోలీసులు కోరారు. ఎవరైనా మిమ్మల్ని బెదిరించి మామూళ్లు అడిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అక్రమార్కులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. నిందితుడు అజార్ ఖాన్ను 25-03-2026న గౌరవప్రదమైన కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్కు తరలించడం జరిగింది.

### ఇంధన ఆందోళనల వేళ.. 'లాక్‌డౌన్' లేదు

# 'లాక్‌డౌన్'పై క్లారిటీ ఇచ్చిన కేంద్రం




న్యూఢిల్లీ, మార్చి 27 : పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో దేశీయంగా ఇంధన కొరత ఆందోళనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు బారులు తీరుతున్నారు. మరోవైపు 'లాక్‌డౌన్' భయాలు వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ దీనిపై స్పష్టతనిచ్చారు. 'లాక్‌డౌన్' వార్తలను కొట్టిపారేసిన కేంద్ర మంత్రి.. ఇంధన లభ్యతకు కేంద్రం చర్యలను వివరిస్తూ వరుస ట్వీట్లు చేశారు.

''అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. ఎనర్జీ, సరఫరా గొలుసు, అత్యవసర సరకు రవాణా వంటి అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. దేశంలో ఇంధన సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. అయితే 'లాక్‌డౌన్'పై వినిపిస్తోన్న ఊహాగానాలు పూర్తిగా అవాస్తవం. అలాంటి ప్రతిపాదనేదీ కేంద్ర ప్రభుత్వం వద్ద లేదు. ఇలాంటి వదంతులు సమాజానికి హాని చేస్తాయి. గందరగోళం సృష్టిస్తాయి. ఈ సమయంలో మనమంతా ప్రశాంతంగా, బాధ్యతాయుతంగా, ఐకమత్యంగా ఉండాలి" అని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

**ఇంధన ఎగుమతులపై పన్ను..**

"గత నెల రోజుల్లో అంతర్జాతీయంగా ముడి చమురు బ్యారెల్ ధర 70 డాలర్ల నుంచి 122 డాలర్ల వరకు వెళ్లొచ్చింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. ఆగ్నేయాసియా దేశాల్లో 30-50శాతం, ఉత్తర అమెరికాలో 30శాతం, ఐరోపాలో 20శాతం, ఆఫ్రికా దేశాల్లో 50శాతం మేర ఇంధన ధరలు పెరిగాయి. కానీ, మన దేశంలో పౌరుల ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ వీటిని పెంచలేదు. అంతేగాక, చమురు కంపెనీల అధిక నష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వ పన్ను ఆదాయాన్ని తగ్గించుకున్నాం (ఎక్సైజ్ సుంకం తగ్గింపును ఉద్దేశిస్తూ). అదే సమయంలో విదేశాలకు ఎగుమతి చేసే ఇంధనంపై ఎగుమతి పన్ను విధించాం" అని పురీ వెల్లడించారు.

**డీజిల్‌పై రూ.21.5శాతం**

విదేశాలకు ఎగుమతి చేసే డీజిల్‌పై లీటర్‌కు రూ.21.5 చొప్పున పన్ను విధించినట్లు కేంద్రం ప్రకటన విడుదల చేసింది. ఇక, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ (ఏటీఎఫ్)పై లీటర్‌కు రూ.29.5శాతం పన్ను విధిస్తున్నట్లు తెలిపింది. వాస్తవానికి 2024లో కేంద్రం ఇంధన ఎగుమతులపై పన్నులను తొలగించింది. అయితే, ప్రస్తుతం పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో వీటిని మళ్లీ ప్రవేశపెట్టింది.

ఇదిలాఉండగా పెట్రోల్‌పై అదనపు ఎక్సైజ్ సుంకాన్ని రూ.13 నుంచి రూ.3కు తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇక, డీజిల్‌పై రూ.10 ఉన్న సుంకాన్ని పూర్తిగా ఎత్తేసింది. దీంతో చమురు మార్కెటింగ్ కంపెనీలకు భారీ ఊరట లభించనుంది.

### ఇజ్రాయెల్-అమెరికా దాడులు..

# ఇరాన్‌లో 1900 దాటిన మృతుల సంఖ్య



టెహ్రాన్, మార్చి 27 : పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రరూపం దాల్చుతోంది. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా చేస్తున్న దాడుల కారణంగా ఇరాన్‌లో ప్రాణ, ఆస్తి నష్టం భారీగా నమోదవుతోందని అక్కడి మీడియా సంస్థలు చెబుతున్నాయి. తాజాగా ఇరాన్ ఆరోగ్య శాఖ వెల్లడించిన అధికారిక వివరాల ప్రకారం.. ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు మృతుల సంఖ్య 1,937కు చేరగా, ఇందులో 240 మంది మహిళలు, 212 మంది చిన్నారులు ఉన్నారు. మరో 24,800 మందికి పైగా గాయపడ్డారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం ఇరాన్ వ్యాప్తంగా దవాఖానాలు, నివాసాలతో సహా సుమారు 82,000 పౌర భవనాలు ధ్వంసమైనట్లు నివేదికలు చెబుతున్నాయి.

**లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ చొరబాటు**

లెబనాన్‌లో మృతుల సంఖ్య దాదాపు 1,100కి చేరుకుందని అంతర్జాతీయ మీడియా ద్వారా నివేదికలు వస్తున్నాయి. ఇజ్రాయెల్ బలగాలు సరిహద్దులు దాటి లిటానీ నదికి దక్షిణాన ఉన్న ప్రాంతాన్ని తమ నియంత్రణలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని తెలుస్తోంది. ఈ యుద్ధంలో ఇజ్రాయెల్‌కు చెందిన 18 మంది పౌరులు, నలుగురు సైనికులు మరణించగా, గల్ఫ్ ప్రాంతంలో 13 మంది అమెరికా సైనికులు కూడా ప్రాణాలు కోల్పోయారని సమాచారం.

**ఏప్రిల్ 6 వరకు ట్రంప్ డెడ్‌లైన్**

అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన 'హార్ముజ్ జలసంధి'ని ఇరాన్ దిగ్బంధించిన విషయం తెలిసిందే. దీనిని తిరిగి తెరవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన గడువును ఏప్రిల్ 6 వరకు పొడిగించారు. పరిస్థితి చక్కబడకపోతే ఇరాన్ ఇంధన కర్మాగారాలను ధ్వంసం చేస్తామని ఆయన అల్టిమేటం జారీ చేశారు. అలాగే హార్ముజ్ జలసంధి గుండా సురక్షితంగా ప్రయాణించేందుకు నౌకల నుంచి ఇరాన్ చట్టవిరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తోందని గల్ఫ్ దేశాల మండలి ఆరోపించింది. మరో వైపు కువైట్ పోర్టుపైనా డ్రోన్ దాడులు జరిగాయి. యుద్ధం వల్ల లక్షలాది మంది నిరాశ్రయులు అవుతున్నారని, భయంకరమైన ఆర్థిక, మానవతా సంక్షోభం తలెత్తుతోందని నార్వేజియన్ రిఫ్యూజీ కౌన్సిల్ వంటి అంతర్జాతీయ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.


## మరిన్ని ఎస్-400లు కొనుగోలు చేయనున్న భారత్..!



న్యూఢిల్లీ, మార్చి 27 : ఆపరేషన్ సిందూర్‌లో గగనతల రక్షణ వ్యవస్థ ఎస్-400 (ట్రా-400) సత్తా చాటిన విషయం తెలిసిందే. దీంతో వీటిని మరిన్ని కొనుగోలు చేసేందుకు భారత్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు నేడు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగే సమావేశంలో కీలక ప్రతిపాదనలను సమీక్షించి, పలు పెద్ద ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇచ్చే అవకాశం ఉంది. వీటిలో ఐదు ఎస్-400 క్షిపణి వ్యవస్థలతో పాటు.. 60 మధ్యశ్రేణి రవాణా విమానాలు కూడా ఉన్నాయి. త్రివిధ దళాల్లో ఆయుధ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. భారత వైమానిక దళం కోసం నాలుగు స్క్వాడ్రన్ల రిమోట్లీ పైలట్ స్ట్రైక్ ఎయిర్‌క్రాఫ్టులు, 800 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలిగే బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను కొనుగోలు చేయాలన్న ప్రతిపాదనను సమీక్షించనున్నట్లు రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన రక్షణ సేకరణ మండలి (డీఏసీ) వెల్లడించింది. ఆధునిక యుద్ధంలో విరివిగా డ్రోన్లు వినియోగిస్తుండడంతో.. భారత పదాతిదళ విభాగాలలో ప్రత్యేక డ్రోన్ రెజిమెంట్లు, ప్రత్యేక క్షిపణి దళాల ఏర్పాటు గురించి కూడా చర్చించనున్నారు.

### అమెరికాను ఢీ కొట్టేందుకు..

# 10 లక్షల మందిని సిద్ధం చేసిన ఇరాన్..!



టెహ్రాన్, మార్చి 27 : ఇరాన్‌లో భూతల దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వస్తున్న వార్తలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ దాడులను అడ్డుకొనేందుకు ఇరాన్ కూడా సన్నాహాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అందులోభాగంగా 10 లక్షల మందికి పైగా సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సైనికాధికారులను ఉటంకిస్తూ ఆ దేశ మీడియా ఈ విషయాన్ని వెల్లడించింది. ఓ వైపు చర్చలు కొనసాగుతున్నాయంటూనే.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియాలో తన సైనిక ఉనికిని విస్తరిస్తున్నారు. ఈ క్రమంలోనే బసిజ్ ఫోర్స్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌తో సహా అనేక విభాగాలు తక్షణమే కదనరంగంలోకి వచ్చేవిధంగా దళాలను బలోపేతం చేస్తున్నట్లు ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి. ఇరాన్ నేలపై అమెరికా సైన్యం అడుగుపెడితే.. వారికి నరకం చూపించేందుకు తమ యోధులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించాయి. స్వచ్ఛందంగా సైన్యంలో చేరతామని బసిజ్ ఫోర్స్, ఐఆర్‌జీసీలకు యువకుల నుంచి పెద్దఎత్తున అభ్యర్థనలు వస్తున్నట్లు వెల్లడించాయి.

**12 ఏళ్ల పిల్లలు సైతం యుద్ధంలోకి..**

ఇదిలాఉండగా.. ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో యుద్ధంలో పాల్గొనేందుకు అర్హత వయసును కూడా ఇరాన్ తగ్గించినట్లు తెలుస్తోంది. 12 ఏళ్ల పిల్లలను సైతం యుద్ధంలో పాల్గొనేందుకు అనుమతివ్వాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీనికి 'ఫర్ ఇరాన్' అని పేరు పెట్టినట్లు వెల్లడించాయి. పెట్రోలింగ్, చెక్ పాయింట్ల దగ్గర వీరిని ఉంచనున్నారు.

**ఇజ్రాయెల్‌లో సైనికుల కొరత..**

ఇదిలాఉండగా.. ఇరాన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ సైనిక కొరతను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. అవసరమైన దానికంటే 12వేల మంది తగ్గినట్లు సైనికాధికారులు ప్రభుత్వానికి వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ కొరత కారణంగా ఐడీఎఫ్ కూలిపోయే ప్రమాదం ఉందని.. ఆ సంస్థ చీఫ్ ఆఫ్ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఐయాల్ జమీర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో సహా ఇతర ఉన్నతాధికారులకు కూడా ఆయన లేఖ రాశారు.

## నేపాల్ ప్రధానిగా బాలేంద్ర షా ప్రమాణం

### -అభినందనలు తెలిపిన ప్రధాని మోదీ-




ఖాడ్మాండు, మార్చి 27 : పొరుగు దేశం నేపాల్‌లో నేపాల్ ప్రభుత్వం మారింది. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ అధ్యక్షుడు బాలేంద్ర షా ఇవాళ ఆ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. మార్చి 5న జరిగిన ప్రతినిధుల సభ ఎన్నికల్లో ఆయన పార్టీ 182 స్థానాలను గెలుచుకుని అతిపెద్ద రాజకీయ శక్తిగా అవతరించిన విషయం తెలిసిందే. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ 'శీతల్ నివాస్'లో జరిగిన ఈ కార్యక్రమంలో దేశ అధ్యక్షుడు రాంచంద్ర పౌడెల్ బాలేంద్ర షాతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ వేడుకలో రాజకీయ హంగులతో పాటు సంప్రదాయం ఉట్టిపడింది. 108 మంది బటుల శంఖనాదాలు, స్వస్తి వాచనాలు, 16 మంది బౌద్ధ భిక్షువుల అష్టమంగళ ప్రార్థనల మధ్య ఈ క్రతువు సాగింది. బాలేంద్ర షా తనదైన శైలిలో నల్లటి దుస్తులు, డార్క్ సన్ గ్లాసెస్ ధరించి ప్రమాణ స్వీకారానికి హాజరై అందరి దృష్టిని ఆకర్షించారు.

**ప్రధాని మోదీ శుభాకాంక్షలు**

బాలేంద్ర షా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే భారత ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికగా ప్లాట్‌ఫామ్ 'X' వేదికగా అభినందనలు తెలిపారు. 'నేపాల్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన బాలేంద్ర షాకు హృదయపూర్వక అభినందనలు. భారత్-నేపాల్ మధ్య ఉన్న పురాతన స్నేహ సంబంధాలను, సహకారాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు మీతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నా' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్ చేశారు. .

## చరిత్ర సృష్టించనున్న ట్రంప్..
## అమెరికా కరెన్సీ నోట్లపై సంతకం



వాషింగ్టన్, మార్చి 27 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చరిత్ర సృష్టించనున్నారు. ఆ దేశ కరెన్సీ నోట్లపై సంతకం చేయబోయే తొలి అధ్యక్షుడిగా నిలవనున్నారు. యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఈ విషయాన్ని ప్రకటించింది. త్వరలో జరగనున్న అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. 1861 నుంచి అమెరికా కరెన్సీ నోట్లపై ట్రెజరర్, ట్రెజరీ కార్యదర్శి సంతకం ఉండడం సంప్రదాయంగా వస్తోంది. ఈ 165 ఏళ్ల సంప్రదాయాన్ని ట్రంప్ ఇప్పుడు బ్రేక్ చేయబోతున్నారు. ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ప్రకారం.. టెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్‌తో పాటు ట్రంప్ సంతకం ఉన్న తొలి 100 డాలర్ల నోట్లను జూన్‌లో ముద్రించనున్నట్లు పేర్కొంది. స్వాతంత్ర్య వేడుకలకు గుర్తుగా ట్రంప్ ముఖచిత్రంతో స్మారక నాణెం రూపొందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఇటీవల వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అందులోభాగంగా తాజా నిర్ణయం కూడా తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై బెసెంట్ మాట్లాడుతూ.. తమ దేశం సాధించిన చరిత్రాత్మక విజయాలను గుర్తుచేసుకోవడానికి ఇంతకంటే గొప్ప మార్గం మరొకటి ఉండదని అభిప్రాయపడ్డారు. అమెరికన్ ట్రెజరర్ బ్రాండన్ బీచ్ కూడా ఈ నిర్ణయాన్ని సమర్థించారు. ఇది సరైన నిర్ణయమేనని.. అందుకు ఆయన పూర్తి అర్హులని వ్యాఖ్యానించారు.

## ముఖ్యమంత్రి పదవికి 30న నితీశ్ రాజీనామా

పాట్నా, మార్చి 27 : బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మార్చి 30న సీఎం, ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేసే అవకాశం ఉంది. ఈనెల 16న రాజ్యసభకు నితీశ్ ఎన్నికయ్యారు. రాజ్యాంగ ప్రకారం ఒక వ్యక్తి ఒకేసారి రెండు సభల్లో పదవులు నిర్వహించరాదు. ఒక పదవిని 14 రోజుల్లోపు వదులుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం బిహార్ శాసనసభ, శాసన మండలికి మార్చి 29 వరకూ విరామం ఇచ్చారు. తిరిగి ఉభయసభలు ఈనెల 30న సమావేశమవుతాయి. అదే రోజు నితీశ్ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయనుండటం దాదాపు ఖరారైందని చెబుతున్నారు.

## దేశంలోని 50% విమానాల్లో సాంకేతిక లోపాలు



న్యూఢిల్లీ, మార్చి 27 : దేశంలోని పౌర విమానయాన రంగంలో భద్రతపై పార్లమెంటరీ ప్యానెల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 50% వాణిజ్య విమానాల్లో సాంకేతిక లోపాలు ఉన్నాయని స్టాండింగ్ కమిటీ ఆన్ సివిల్ ఏవియేషన్ తాజాగా వెల్లడించింది. ఏడాదికాలంగా చేపట్టిన తనిఖీల్లో వాటిని గుర్తించామని.. తరచూ అవే సాంకేతిక సమస్యలు వెలుగు చూస్తున్నాయని పేర్కొంది. జనవరి 2025 నుంచి ఫిబ్రవరి 2026 వరకు 754 విమానాల్లో ఆడిట్ నిర్వహించగా.. 377 వాటిల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఆడిట్ చేసిన వాటిలో ఇండిగో విమానాల సంఖ్యే ఎక్కువని.. లోపాలు కూడా వాటిలోనే అధికంగా ఉన్నాయని కమిటీ వెల్లడించింది. ఫిబ్రవరి మూడు వరకు 405 విమానాల్లో ఆడిట్ నిర్వహించగా.. 148 ఫ్లైట్లలో లోపాలు ఉన్నాయని పేర్కొంది. కొన్ని లోపాలు రిపీట్ అయ్యాయని చెప్పింది. 166 ఎయిరిండియా , 101 ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాల్లో తనిఖీలు చేపట్టారు. వాటిల్లోనూ లోపాలు వెలుగు చూశాయి. దాదాపు సగం ఈ రెండు విమానయాన సంస్థలకు చెందిన వాటిల్లోనే ఉన్నాయి. ఈ స్థాయిలో లోపాలు వెలుగు చూడటంపై కమిటీ ఆందోళన వ్యక్తంచేసింది. ఇవి ప్రయాణికుల భద్రత, సంస్థల విశ్వసనీయతపై ప్రభావం చూపిస్తాయని హెచ్చరించింది. గతేడాది అహ్మదాబాద్ విమాన ప్రమాదం తర్వాత.. ఎయిరిండియాపై డీజీసీఏ నిర్వహించిన ఆడిట్‌ను కూడా నివేదిక ప్రస్తావించింది. ఆ ఆడిట్‌లో దాదాపు 100 భద్రతాలోపాలను గుర్తించారు. అందులో 7 ఉల్లంఘనలు లెవెల్-1కి సంబంధించినవని.. వాటివల్ల తీవ్ర ముప్పు పొంచి ఉండడంతో వెంటనే వాటిని సరిచూసుకోవాలని ఎయిరిండియాకు డీజీసీఏ సూచించిన సంగతి తెలిసిందే. విమానాల మోడళ్లను బట్టి.. శిక్షణ విషయంలో వ్యత్యాసాలు ఉండటాన్ని ప్రస్తావించింది. 2025 చివరినాటికి భద్రతా ఉల్లంఘనలకు సంబంధించి 19 నోటీసులను విమానయాన సంస్థలకు డీజీసీఏ జారీ చేసిందని.. వాటిలో 9 నోటీసులు ఎయిరిండియాకే వెళ్లాయని వెల్లడించింది. సిబ్బంది కొరతను ప్రస్తావిస్తూ.. వేగంగా వృద్ధి చెందుతోన్న విమానయాన రంగాన్ని డీజీసీఏ పర్యవేక్షించే సామర్థ్యంపైనా ప్రశ్నలు లేవనెత్తింది.

## ఆయిల్ ధరల తగ్గింపు సాహసోపేతం



హైదరాబాద్, మార్చి 27 (పోలీస్ నిఘా) : భారత ప్రధాని నరేంద్ర మోదీ శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా దేశ ప్రజలకు అందించిన తీపి కబురు పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ సామాన్య, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలే పరమావధిగా కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గించడం ఒక సాహసోపేతమైన, జనరంజకమైన నిర్ణయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని ఏకంగా 'సున్నా' (0) స్థాయికి తగ్గించడం మోదీ పరిపాలనా దక్షతకు నిదర్శనమని కొనియాడారు. పెట్రోల్‌పై కూడా రూ.10 మేర భారాన్ని తగ్గించి కేంద్రం తన బాధ్యతను చాటుకుందని, మరి ఇప్పుడు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన బాధ్యతను ఎప్పుడు నెరవేరుస్తుంది అని ప్రశ్నించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వ్యాట్ సుమారు 35% ఉండటం వల్ల సామాన్యుడిపై పెను భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం పన్నులు తగ్గిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తన ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధమన్నారు. గత ప్రభుత్వాలు చేసిన అప్పులు, ఆయిల్ బాండ్ల భారం ఉన్నా కేంద్రం వెనక్కి తగ్గలేదని, కానీ, తెలంగాణ ప్రభుత్వం మాత్రం పన్నుల రూపంలో ప్రజల రక్తాన్ని పిండుతోందని అన్నారు. పెట్రోల్ ధరలో కేంద్రం వాటా కంటే రాష్ట్రం వాటాయే ఎక్కువగా ఉండటం అత్యంత దురదృష్టకరమన్నారు.


## వాణిజ్య గ్యాస్ సరఫరా పెంపుకు కేంద్రం నిర్ణయం



న్యూఢిల్లీ, మార్చి 27 : దేశంలోని వివిధ హోటళ్లకు, పారిశ్రామిక రంగాలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. గత కొంత కాలంగా ఉన్న ఇంధన కొరతను అధిగమించేలా వాణిజ్య గ్యాస్ సరఫరాను 70 శాతానికి పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. విదేశాల నుంచి గ్యాస్ నౌకలు భారత్‌కు చేరుకుంటుండటంతో సరఫరాపై ఉన్న ఆంక్షలను సడలించి, పారిశ్రామిక కార్యకలాపాలు ఊపందుకునేలా చర్యలు చేపట్టింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి డా. నీరజ్ మిట్టల్ అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. గతంలో ఉన్న 50 శాతం కోటాను ఇప్పుడు 70 శాతానికి పెంచినట్లు అందులో పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఎదురవుతున్న సరఫరా అడ్డంకులను అధిగమించి, దేశీయంగా ఇంధన లభ్యతను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసు కున్నట్లు ప్రభుత్వం తెలిపింది. పెంచిన గ్యాస్ సరఫరాలో ముఖ్యంగా ఉపాధి కల్పించే కీలక రంగాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. కేంద్రం సూచించిన జాబితా ప్రకారం ఈ క్రింది రంగాలకు లబ్ధి చేకూరనుంది. అమెరికా, అర్జెంటీనా వంటి దేశాల నుంచి గ్యాస్ నౌకలు నిరంతరాయంగా భారత పోర్టులకు చేరుకుంటుండటంతో ఇప్పుడు పరిస్థితి అదుపులోకి వచ్చింది. దీనివల్ల హోటళ్లు, రెస్టారెంట్లతో పాటు భారీ పరిశ్రమలకు కూడా గ్యాస్ కొరత తీరనుంది.

### అణు విద్యుత్ ప్లాంట్ సమీపంలో దాడి..

## రేడియేషన్ లీకేజీపై ఐఏఈఏ ఆందోళన



న్యూఢిల్లీ, మార్చి 27 : ఇరాన్‌లోని బుషెహర్ న్యూక్లియర్ ప్లాంట్‌లో రేడియేషన్ లీకేజీ భయాలపై అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది. ఆ ప్లాంట్‌లో పెద్ద మొత్తంలో అణుపదార్థాలు ఉన్నట్టు ఐఏఈఏ డైరెక్టర్ జనరల్ రఫేల్ గ్రూసి పేర్కొన్నారు. "బుషెహర్‌లోని న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌లో ఎక్కువ మొత్తంలో అణుపదార్థాలు నిల్వ ఉన్నాయి. దీనికి ప్రమాదం జరిగితే రేడియేషన్ లీకేజీ వల్ల ఇరాన్‌తో పాటు ఆ దేశం వెలుపలా భారీస్థాయిలో ప్రమాదం జరిగే ముప్పు పొంచిఉంది. ఇలాంటి ప్రమాదాన్ని నివారించేందుకు అన్ని పక్షాలు సంయమనం పాటించాలి" అని ఐఏఈఏ డైరెక్టర్ గ్రూసి పిలుపునిచ్చారు. ఇరాన్ సైనిక స్థావరాలు, క్షిపణి తయారీ కేంద్రాలు, ఆయుధ నిల్వలే లక్ష్యంగా ఇజ్రాయెల్-అమెరికా భీకరంగా దాడులు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో బుషెహర్ ప్రావిన్స్‌లోని ఐఆర్‌జీసీ నేవీ, వైమానిక స్థావరాల మౌలిక సదుపాయాలు ధ్వంసమైనట్లు ఇటీవల శాటిలైట్ చిత్రాల్లో వెల్లడైంది. ఈ దాడులు బుషెహర్ అణు విద్యుత్ ప్లాంట్‌కు సమీపంలోనే జరిగినట్లు వార్తలు రావడంతో.. రేడియేషన్ లీకేజీపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఇక్కడ పనిచేసే తమ సిబ్బందిని రష్యా తరలించినట్లు సమాచారం.

Printed, Published & Owned by Kemoju Madhuri, Plot No.32, 3rd Floor, R.K.Nagar, Attapur, Rajendra Nagar, R.R.Dist., Telangana State, Pin Code:500043, Printed at S.V.Printers, Plot No.32,Ground Floor, R.K.Nagar, Attapur, Rajendra Nagar, R.R.Dist., Telangana State, Pin Code: 500043, Editor : Kemoju Srinivas, RNI No.TELTEL/2016/68720, e-mail: policenigah@gmail.com. Cell: 9133613813, Off: 040-35668279